teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్


నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

## ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు లైన్ క్లియర్

హైకోర్టు కీలక తీర్పు

మున్సిపల్ ఎన్నికపై స్టే ఎత్తివేత

తుది నిర్ణయం ఈసీ, కలెక్టర్‌దేనని వెల్లడి




05

ములుగు | సంపుటి : 04 | సంచిక : 225 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | గురువారం | 19 ఫిబ్రవరి 2026 | పేజీలు : 08 | వెల ‘ 5

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.



## తెలుగు రాష్ట్రాల్లో బాంబు కలకలం



### పలు కోర్టులకు బెదిరింపులు

ఏకకాలంలో హైదరాబాద్, కరీంనగర్ కోర్టులకు హెచ్చరికలు

రంగంలోకి బాంబ్, డాగ్ స్క్వాడ్

నాంపల్లి నుంచి అనంతపురం వరకు ముమ్మర తనిఖీలు




2

తెలుగు రాష్ట్రాల్లోని పలు కోర్టులకు బుధవారం బాంబు బెదిరింపులు వచ్చాయి. హైదరాబాద్‌లోని నాంపల్లి, కరీంనగర్, రాజమహేంద్రవరం, అనంతపురం కోర్టులకు ఈ బెదిరింపులు వచ్చాయి. దాంతో ఆయా కోర్టుల్లో బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాలతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం కోర్టుకు బుధవారం బాంబు బెదిరింపు కాల్ వచ్చింది.

## బ్లింకిట్‌కు ఢిల్లీ పోలీసుల షాక్

- చాకుల విక్రయంపై క్రిమినల్ కేసు నమోదు
- మర్డర్ కేసులో బ్లింకిట్ కత్తుల వాడకం
- ఆయుధ చట్టం ఉల్లంఘించారన్న పోలీసులు




న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 18 (తీన్మార్ న్యూస్): ప్రముఖ క్విక్ కామర్స్ సంస్థ బ్లింకిట్‌కు ఎదురుదెబ్బ తగిలింది. బ్లింకిట్ నుండి కొనుగోలు చేసిన చాకులతో మర్డర్లకు పాల్పడిన కేసులో ఢిల్లీ పోలీసులు ఈ సంస్థపై కేసు నమోదు చేశారు. ఆన్‌లైన్ లో చేసిన ఆర్డర్ ని డెలివరి చేస్తే కేసు నమోదు చేస్తారా అనే సందేహం కలుగుతోందా? ఇక్కడే అసలు తిరకాసు ఉంది. ఇటీవల ఢిల్లీలో రెండు వేర్వేరు హత్యలు కలకలం రేపాయి. అయితే ఈ రెండు హత్య కేసుల్లో నిందితులు ఉపయోగించిన కత్తులను బ్లింకిట్ నుంచి మిగతా 2 లో

## మహిళలకు ఆర్టీసీ స్మార్ట్ కార్డులు

వచ్చే నెల నుంచే జారీ

ఫేక్ ఆధార్ కార్డులకు చెక్

అర్హులైన వారికే ఉచిత బస్సు ప్రయాణం

మూడు డిజైన్లతో స్మార్ట్ కార్డులు సిద్ధం

త్వరలోనే ప్రభుత్వం తుది నిర్ణయం



హైదరాబాద్, ఫిబ్రవరి 18(తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని పొందేందుకు మహిళలకు స్మార్ట్ కార్డు జారీ చేసేందుకు ఆర్టీసీ కసరత్తు చేస్తోంది. వచ్చే మిగతా 2 లో




## ఢిల్లీ ఏఐ సమ్మిట్‌లో రోబోటిక్ డాగ్ రచ్చ

- గాల్గోటీస్ యూనివర్సిటీ క్షమాపణలు
- చైనా రోబోను తామే తయారుచేశామన్న ప్రొఫెసర్
- అడ్డంగా బుక్కైన వైనం..
- స్టాల్ ఖాళీ చేయాలని అధికారుల ఆదేశం
- ప్రతినిధికి అవగాహన లేదంటూ వర్సిటీ వివరణ

న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 18 (తీన్మార్ న్యూస్): ఢిల్లీ ఏఐ సమ్మిట్‌లో చైనా రోబోటిక్ కుక్క ప్రదర్శన వివాదంపై ఎట్టకేలకు గాల్గోటీస్ యూనివర్సిటీ సారీ చెప్పింది. తన రిప్రజెంటేటివ్ తప్పుడు సమాచారం ఇచ్చారని వివరణ ఇచ్చింది. రోబోటిక్ డాగ్ పై ఆమెకు ఎలాంటి అవగాహన లేదు. ఆమె మీడియా ముందుకు మిగతా 2 లో

## తెలుగు రాష్ట్రాల్లో ఎండలు

"బంగాళాఖాతంలో అల్పపీడనం"

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

తెల్లవారుజామున మాత్రమే చలి



## 2034 నాటికి నెట్-జీరో నగరంగా హైదరాబాద్

- క్లైమేట్ వీక్ సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి
- గ్రీన్ ఎనర్జీయే భవిష్యత్ కరెన్సీ
- బొగ్గు నుంచి సోలార్ వైపు తెలంగాణ పయనం

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (తీన్మార్ న్యూస్): గ్రీన్ ఎనర్జీ ప్రపంచ పరిరక్షణకు లాభదాయకమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. తెలంగాణలో గ్రీన్ ఎనర్జీకి మిగతా 2 లో






## రెండు రాజ్యసభ స్థానాలకు నగారా

### కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల

ఫిబ్రవరి 26న నోటిఫికేషన్

మార్చి 16న పోలింగ్, అదే రోజు ఫలితాలు

దేశవ్యాప్తంగా 37 స్థానాలకు ఎన్నికలు

.. వివరాలు 2లో

## భాగ్యనగర పరిశుభ్రతపై సీఎస్ సీరియస్

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

రోజుకు 7,800 టన్నుల చెత్త సేకరణ

4,500 స్వచ్ఛ ఆటోలతో ఇంటింటికీ సేవలు

గ్రేటర్ హైదరాబాద్ క్లీన్ సిటీగా ఉండాల్సిందే

అధికారులకు సీఎస్ రామకృష్ణారావు ఆదేశం



హైదరాబాద్, ఫిబ్రవరి 18 (తీన్మార్ న్యూస్): భాగ్యనగర పరిశుభ్రతలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు స్పష్టం చేశారు. గ్రేటర్ హైదరాబాద్‌ని మిగతా 2 లో

## బాల్క సుమన్‌కు 14 రోజుల రిమాండ్

- ఆదిలాబాద్ జైలుకు తరలింపు
- మంత్రి వివేక్ కాన్వాయ్‌పై దాడి కేసులో అరెస్ట్
- మంచిర్యాల కోర్టు కీలక తీర్పు
- భారీ బందోబస్తు మధ్య కోర్టులో హాజరుపరిచిన పోలీసులు

02



## బాల్క సుమన్ అరెస్ట్ బందిపోట్ల చర్య



కేటీఆర్ తీవ్ర ఆగ్రహం

దళిత నాయకుడిని నోటీసులు లేకుండా బంధిస్తారా..?

రేవంత్ ప్రభుత్వంపై ఘాటు విమర్శలు

02


# తెలుగు రాష్ట్రాల్లో బాంబు కలకలం

తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 18 (తీన్మార్ న్యూస్): తెలుగు రాష్ట్రాల్లోని పలు కోర్టులకు బుధవారం బాంబు బెదిరింపులు వచ్చాయి. హైదరాబాద్‌లోని నాంపల్లి, కరీంనగర్, రాజమహేంద్రవరం, అనంతపురం కోర్టులకు ఈ బెదిరింపులు వచ్చాయి. దాంతో ఆయా కోర్టుల్లో బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాలతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం కోర్టుకు బుధవారం బాంబు బెదిరింపు కాల్ వచ్చింది. దీంతో కోర్టు సిబ్బంది త్రీ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. దాంతో కోర్టు ప్రాంగణంలో బాంబు, డాగ్ స్క్వాడ్‌లతో పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ బాంబు కాల్ రావడంతో న్యాయవాదులు, కక్షిదారులను కోర్టు ప్రాంగణం నుంచి పోలీసులు బయటకు పంపేశారు. అలాగే ఈ కాల్ ఎక్కడి నుంచి వచ్చిందనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు కోర్టులో ఎక్కడా




బాంబు ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఈ ఫోన్ కాల్ ఆకతాయి చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. మరోవైపు అనంతపురం కోర్టుకూ ఇదే తరహా ఫోన్ కాల్ వచ్చింది. ఇక తెలంగాణలో పలు కోర్టులకు ఈ-మెయిల్స్ ద్వారా బాంబు బెదిరింపులు అందాయి. ఆ జాబితాలో నాంపల్లి కోర్టు సైతం ఉంది. మధ్యాహ్నం 12.05 గంటలకు కోర్టుల్లో బాంబు పేలుతుందంటూ ఈ మెయిల్‌లో అగంతకులు పేర్కొన్నారు. దాంతో కోర్టులోని సిబ్బంది, న్యాయవాదులు, కక్షిదారులను బయటకు పంపి పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. అలాగే కరీంనగర్ కోర్టులో సైతం తనిఖీలు కొనసాగుతున్నాయి. గతంలో సైతం ఇదే తరహాలో కోర్టులకు బాంబు బెదిరింపులు వచ్చాయి. అయితే మళ్లీ అలాగే బాంబు బెదిరింపులు రావడంతో పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. దాంతో కోర్టుల్లో బాంబు, డాగ్ స్క్వాడ్‌తో ముమ్మర తనిఖీలు చేపట్టారు.

## తెలుగు రాష్ట్రాల్లో ఎండలు



హైదరాబాద్, ఫిబ్రవరి 18 (తీన్మార్ న్యూస్): తెలుగు రాష్ట్రాల్లో వాతావరణం వేగంగా మారుతోంది. గత కొన్ని రోజులుగా చలి తీవ్రత తగ్గి, ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. ప్రస్తుతం కేవలం తెల్లవారుజామున మాత్రమే స్వల్పంగా చలి ప్రభావం కనిపిస్తుండగా, పగటిపూట ఎండలు ముదురుతున్నాయి. ఇదే సమయంలో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన పరిస్థితులపై వాతావరణ శాఖ కీలక అప్‌డేట్ ఇచ్చింది.

**బంగాళాఖాతంలో అల్పపీడన కదలికలు**

హిందూ మహాసముద్రం, దానికి ఆనుకుని ఉన్న నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రాంతం ప్రస్తుతం స్థిరంగా కొనసాగుతోంది. దీనికి అనుబంధంగా సముద్ర మట్టానికి సుమారు 5.8 కి.మీ ఎత్తు వరకు ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉంది. ఇది రాగల 24 గంటల్లో మరింత బలపడి, పశ్చిమ వాయువ్య దిశగా శ్రీలంక వైపు కదిలే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు తెలిపారు. దీని ప్రభావంతో సముద్ర తీర ప్రాంతాల్లో గాలుల వేగం పెరగనుంది.

**ఆంధ్రప్రదేశ్ వాతావరణ సూచన**

అమరావతి వాతావరణ కేంద్రం నివేదిక ప్రకారం, రాష్ట్రంలో దిగువ ట్రోపో ఆవరణంలో తూర్పు, ఆగ్నేయ దిశల నుండి గాలులు వీస్తున్నాయి. కోస్తా ఆంధ్ర, యానాం: బుధ, గురువారాల్లో ప్రధానంగా పొడి వాతావరణం నెలకొంటుంది. అక్కడక్కడా దట్టమైన పొగమంచు కురిసే అవకాశం ఉంది. శుక్రవారం నాటికి కూడా ఇదే పరిస్థితి కొనసాగుతుంది. రాయలసీమ: ఇక్కడ కూడా పొడి వాతావరణమే ఉండనుంది. అయితే, రాగల రెండు రోజుల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుండి 4 డిగ్రీల సెంటిగ్రేడ్ తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు.

**తెలంగాణలో వాతావరణ పరిస్థితి**

హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపిన వివరాల ప్రకారం, తెలంగాణలో ఆగ్నేయ దిశ నుండి గాలులు వీస్తున్నాయి. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా రాగల మూడు రోజుల పాటు (బుధ, గురు, శుక్రవారాలు) పొడి వాతావరణం ఏర్పడుతుంది. కనిష్ట ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో చలి ప్రభావం క్రమంగా తగ్గుముఖం పట్టనుంది. ముఖ్య గమనిక: మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా, తెల్లవారుజామున ప్రయాణించే వారు పొగమంచు పట్ల జాగ్రత్తగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది.

## బాల్క సుమన్‌కు 14 రోజుల రిమాండ్



తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 18 (తీన్మార్ న్యూస్): మంత్రి వివేక్ వెంకటస్వామి కాన్వాయ్‌పై దాడి కేసులో అరెస్టైన బీఆర్ఎస్ నాయకుడు బాల్క సుమన్‌కు మంచిర్యాల కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ప్రిన్సిపల్ జడ్జి ఆదేశాల మేరకు ఆయనను ఆదిలాబాద్ జైలుకు తరలించారు. పోలీసులు బాల్క సుమన్‌ను క్యాతన్‌పల్లి వద్ద అరెస్టు చేశారు. అరెస్టు సమయంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా, పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం రామకృష్ణాపురం పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఈ కేసులో బాల్క సుమన్‌ను ఏ1గా, మూల రాజిరెడ్డిని ఏ2గా, అనిల్‌ను ఏ3గా పోలీసులు పేర్కొన్నారు. బీఎన్ఎస్ లోని పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. వీటిలో చట్టవిరుద్ధంగా గుమికూడడం (బీఎన్ఎస్ 189(3)), అల్లర్లు (191(2)), మారణాయుధాలతో అల్లర్లు (191(3)), ఆయుధాలతో గాయపరచడం (118(1)), ప్రజా ఆస్తులను ధ్వంసం చేయడం (324(5)), అలాగే ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరించడం (223 తీ/ష 190) వంటి సెక్షన్లు ఉన్నాయి. అరెస్టు అనంతరం బాల్క సుమన్‌ను మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం కట్టుదిట్టమైన భద్రత మధ్య కోర్టులో హాజరుపరిచారు. వాదనలు విన్న న్యాయమూర్తి ఆయనకు 14 రోజుల రిమాండ్ విధిస్తూ జైలుకు తరలించాలని ఆదేశించారు. ఈ ఘటనతో మంచిర్యాల జిల్లాలో రాజకీయ ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. పోలీసులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండి భద్రతను కట్టుదిట్టం చేశారు.

## బాల్క సుమన్ అరెస్ట్ బందిపోట్ల చర్య



హైదరాబాద్, ఫిబ్రవరి 18 (తీన్మార్ న్యూస్): మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అరెస్టును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. క్యాతనపల్లిలో మంత్రి వివేక్ నేరుగా ఎన్నికల ప్రక్రియను శాసిస్తూ అధికారులపై ఒత్తిడి తెస్తున్నాడని కేటీఆర్ అన్నారు. బాల్క సుమన్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఒక దళిత నాయకుడిని, ముందస్తు నోటీసులు లేకుండా బందిపోట్ల మాదిరిగా అరెస్టు చేయడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ పిరికిపంద చర్యకు నిదర్శనం అంటూ మండిపడ్డారు. పోలీసు యంత్రాంగం కాంగ్రెస్ పార్టీకి ప్రైవేట్ సైన్యంలా మారిపోయిందని విమర్శించారు. నిష్పక్షపాతంగా ఉండాల్సిన రిటర్నింగ్ ఆఫీసర్లు, పోలీసులు కాంగ్రెస్ నాయకుల కళ్లసైగలకు తలొగ్గి పని చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాల్క సుమన్‌తో పాటు పార్టీ సీనియర్ నేతలను, కార్యకర్తలను పోలీసులు వేధించడం ఆపాలని కేటీఆర్ అన్నారు. లేదంటే ఇప్పుడు అధికార పార్టీకి, మంత్రికి అడుగులకు మడుగులొత్తుతూ, అక్రమాలకు పాల్పడుతున్న ప్రతి ఒక్క పోలీస్ అధికారి భవిష్యత్తులో తగిన ప్రతిఫలం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

# 2034 నాటికి నెట్-జీరో నగరంగా హైదరాబాద్

మొదటి పేజీ తరువాయి

ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో గ్రీన్ ఎనర్జీకి తాము ప్రోత్సాహిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ 30 లక్షలకు పైగా పంప్‌సెట్‌లు, దాదాపు 50 లక్షల గృహాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. ఈ శక్తిని బొగ్గు, సాంప్రదాయ ఇంధన వనరుల నుంచి సోలార్, గ్రీన్ ఎనర్జీ వైపు మార్చడమే తమ ప్రధాన లక్ష్యం అని తెలిపారు. మహారాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 'క్లైమేట్ వీక్' సదస్సులో బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ప్రసంగం చేశారు. కాలుష్య నియంత్రణ, రీసైక్లింగ్, స్థిర శక్తి ఉత్పత్తి పద్ధతులపై నిరంతరం పరిశోధనలు కొనసాగిస్తున్నామన్నారు.

**దేశంలోనే తొలి నగరంగా హైదరాబాద్:**

హైదరాబాద్‌ను 2034 నాటికి నెట్–జీరో నగరంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని సీఎం పునరుద్ఘాటించారు. పట్టణాభివృద్ధిలో భాగంగా తాము కార్బన్ ఫుట్‌ప్రింట్ ఆడిట్ చేపట్టనున్న తొలి భారత నగరంగా హైదరాబాద్ నిలవబోతుందన్నారు. వచ్చే ఐదేళ్లలో కోర్ అర్బన్ రీజియన్(క్యూర్)లో దాదాపు పరిశ్రమలు ఉండవని స్పష్టం చేశారు. స్వాతంత్ర్యం అనంతరం తొలి నాలుగు దశాబ్దాల్లో దేశంలో ప్రధాన ప్రాధాన్యతలు విద్యా వ్యవస్థ, నీటిపారుదల రంగాలేనని సీఎం గుర్తు చేశారు. 1991 నుంచి 2020 వరకు లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ సంస్కరణలతో భారత్ సేవా రంగంలో శక్తివంతమైన దేశంగా ఎదిగిందని వివరించారు. 1991 తర్వాత గ్లోబల్ సాఫ్ట్ వేర్, టెక్ సంస్థలు తమ బ్యాక్ ఆఫీస్ కార్యకలాపాలకు భారత్‌ను ఎంచుకున్నాయని అందుకే ప్రపంచంలో అత్యధిక గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు మన దేశంలో ఉన్నాయన్నారు. అయితే, ఈ టెక్ పురోగతిలో తయారీ రంగం ఎక్కువగా అవకాశాలు కోల్పోయినట్లు అభిప్రాయపడ్డారు.

**చైనా ౦1 ప్రయత్నామ్నాయం మా లక్ష్యం:**



కోవిడ్ అనంతరం ప్రభుత్వాల దృష్టికోణం మారిందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం అభివృద్ధి వ్యూహంలో తయారీ రంగం, పర్యావరణ పరిరక్షణ, సుస్థిరత్వం కీలకంగా మారాయని, ఏ ఆర్థిక వ్యవస్థకైనా విద్యుత్ ఉత్పాదక వనరులే అసలైన కరెన్సీ అన్నారు. తెలంగాణ జీడీపీని 200 బిలియన్ డాలర్ల స్థాయి నుంచి 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయడం లక్ష్యమని తెలిపారు. భవిష్యత్ అభివృద్ధికి ఆర్థిక వ్యవస్థ, పర్యావరణం, విద్య, నైపుణ్యాలు, వనరులు, ఉపాధి ప్రధాన స్తంభాలుగా నిలుస్తాయని అన్నారు. రాష్ట్ర వ్యూహాత్మక అభివృద్ధికి తెలంగాణను క్యూర్, ప్యూర్, రేర్ జోన్‌లుగా విభజించినట్లు వివరించారు. ఈ ప్రాంతాన్ని దేశంలోనే అతిపెద్ద తయారీ కేంద్రంగా అభివృద్ధి చేసి "చైనా ౦1" ప్రత్యామ్నాయంగా తెలంగాణను నిలబెట్టడమే తమ ప్రభుత్వ లక్ష్యం అని చెప్పారు.

**తెలంగాణలోనే ఈవీ తయారీ కోసం చర్చలు:**

తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తిలో దాదాపు 25శాం గ్రీన్ సోర్సుల నుంచే వస్తోందని సీఎం తెలిపారు. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య ప్రాంతాన్ని ప్రధాన తయారీ జోన్‌గా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులు, ముఖ్యంగా డేటా సెంటర్లు, పరిశ్రమలు గ్రీన్ ఎనర్జీని కోరుకుంటున్నాయని, తెలంగాణ ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్న క్రమంలో వనరుల పెరుగుదలలో ప్రధాన భాగం గ్రీన్‌గా ఉండాలని తన సంకల్పాన్ని వ్యక్తం చేశారు. అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి సృష్టి, ఉత్పత్తి, వినియోగం పెంపు కొనసాగుతూనే పర్యావరణ పరిరక్షణకు సమాన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. తెలంగాణ మూడు జోన్‌లలో గ్రీన్ స్ట్రాటజీని అవలంబించిందని తెలిపారు. తెలంగాణలోనే ఈవీ తయారీ కోసం సంస్థలతో చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజా రవాణా వ్యవస్థను పర్యావరణహితంగా మార్చే దిశగా 2 లక్షలకుపైగా ఆటోరిక్షాలను రెట్రోఫిట్ చేస్తుండగా, 3,500 కంటే ఎక్కువ ఆర్టీసీ బస్సులను ఎలక్ట్రిక్ బస్సులుగా మారుస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ మెట్రోను ప్రస్తుత 71 కి.మీ. నుంచి 200 కి.మీ. పైగా విస్తరించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

**హైడ్రా రూపంలో ప్రత్యేక దళం:**

పరిశ్రమలను కోర్ అర్బన్ ప్రాంతం నుంచి పెరి అర్బన్ జోన్‌లకు తరలిస్తున్నామని సీఎం చెప్పారు. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో భాగంగా మూసీ నది పునరుద్ధరణ, సరస్సులు, చెరువుల సంరక్షణ, వాటర్ గ్రిడ్, వనరుల నిర్వహణ ప్రణాళికలను ముఖ్యమంత్రి వివరించారు. హైడ్రా రూపంలో పర్యావరణ రక్షణకు ప్రత్యేక పోలీసు దళాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హైదరాబాద్‌లో వాతావరణ ప్రమాదాలను తగ్గించి నగరాన్ని సురక్షితమైన, వేగంగా అభివృద్ధి చెందే నగరంగా తీర్చిదిద్దుతామన్నారు. తెలంగాణను మొత్తం దేశానికి ఆదర్శంగా నిలబెట్టడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

## బ్లింకిట్‌కు ఢిల్లీ పోలీసుల షాక్

మొదటి పేజీ తరువాయి

కొనుగోలు చేసినట్లు తెలింది.

**ఆన్ లైన్ విక్రయాలపై ఆంక్షలు:**

నిబంధనల ప్రకారం 7.62 సెంటీమీటర్ల పొడవు, 1.72 సెంటీమీటర్ల వెడల్పు గల బ్లేడ్లు ఉన్న ఫోల్డింగ్ పాకెట్ చాకులు మాత్రమే ఆన్‌లైన్‌లో విక్రయించాలి. కానీ ఈ హత్య కేసుల్లో నిందితులు ఉపయోగించిన చాకులు 8 సెంటిమీటర్ల పొడవు 2.5 సెంటిమీటర్ల వెడల్పుతో ఉన్నాయి. అయితే ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు పాటించకుండా బ్లింకిట్ వీటిని విక్రయించిందని ఆయుధ చట్ట ఉల్లంఘన కింద పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో బ్లింకిట్ స్టోర్లపై రెయిడ్స్ నిర్వహించి 55 కు పైగా చాకులను స్వాధీనం చేసుకున్నారు.

## మహిళలకు ఆర్టీసీ స్మార్ట్ కార్డులు

మొదటి పేజీ తరువాయి

నెల నుంచి స్మార్ట్ కార్డులు ఇవ్వబోతున్నట్లు తెలంగాణ ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తెలిపారు. తాజాగా ఓ మీడియా చానల్‌తో మాట్లాడిన ఆయన ఇతర రాష్ట్రానికి చెందిన మహిళలు తెలంగాణ అడ్రస్‌తో ఫేక్ ఆధార్ కార్డులను తయారు చేసుకుని ఈ పథకం కింద ప్రయాణిస్తున్నారని, దీన్ని చెక్ పెట్టేందుకు త్వరలోనే స్మార్డ్ కార్డులను తీసుకువస్తున్నామన్నారు. ఇప్పటికే స్మార్ట్ కార్డుల నమూనాగా మూడు డిజైన్లు సిద్ధం చేశామని, వీటిలో నుంచి ఒకదాన్ని ప్రభుత్వం ఫైనల్ చేయనుందని చెప్పారు. స్మార్ట్ కార్డులు వచ్చాక టికెట్ జారీ చేయడం కూడా మరింత సులభం అవుతుందన్నారు.

**మార్చి నుంచి ఏసీ, ఈవీ బస్సుల్లో డిస్కౌంట్**

వేసవి సెలవుల దృష్ట్యా వచ్చే మార్చి 1 నుంచి ఏసీ, మిగతా లగ్జరీ బస్సుల్లో డిస్కౌంట్ ఇవ్వబోతున్నట్లు నాగిరెడ్డి తెలిపారు. వీటిల్లోని టికెట్ ధరలు ఎక్స్‌ప్రెస్ టికెట్ ధరలతో సమానంగా తగ్గించే ప్రయత్నం చేస్తామన్నారు. పొలుష్యన్ నియంత్రించే భాగంగా ఓఆర్ఆర్ లోపల ఎలక్ట్రికల్ బస్సులే నడపాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు. పీఎంఈ డ్రైవ్ కింద త్వరలో రాష్ట్రానికికి 2,000 బస్సులు రాష్ట్రానికి రాబోతున్నాయన్నారు.

## రెండు రాజ్యసభ స్థానాలకు నగారా

తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 18 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో రెండు రాజ్యసభ స్థానాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం దేశవ్యాప్తంగా 37 మంది రాజ్యసభ ఎంపీల పదవీకాలం పూర్తికానుండగా ఆయా స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలకు ఫిబ్రవరి 26న నోటిఫికేషన్ రానుంది. మార్చి 5వ తేదీ వరకూ నామినేషన్ల స్వీకరణ, 6న స్క్రూటినీ, మార్చి 9వ తేదీ వరకూ నామినేషన్ల విత్ డ్రా జరగనున్నాయి. మార్చి 16న ఉదయం 9 గంటల నుంచి 4 గంటల వరకూ పోలింగ్ జరగనుండగా, అదే రోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. మార్చి 20వ తేదీ నాటికి దేశవ్యాప్తంగా రాజ్యసభ్య ఎన్నికలు ముగియనున్నాయి. ఏప్రిల్ 9వ తేదీతో తెలంగాణ ఎంపీలైన కేఆర్ సురేష్ రెడ్డి, అభిషేక్ సింఘ్వీ పదవీకాలం పూర్తి కానున్నాయి. ఆ రెండు స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం సిద్ధమవుతోంది. కేఆర్ సురేష్ రెడ్డి బీఆర్ఎస్ నుంచి, అభిషేక్ మను సింఘ్వీ కాంగ్రెస్ పార్టీ నుంచి రాజ్యసభలో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మొత్తం 37 స్థానాలకు రాజ్యసభ ఎన్నికలు జరగాల్సి ఉంది. వీటిలో ఏడు మహారాష్ట్ర, ఒడిశాలో మూడు, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ లో ఆరేసి స్థానాలు, అస్సాంలో మూడు, బిహార్ లో నాలుగు, ఛత్తీస్ గఢ్ లో రెండు, హర్యానా, హిమాచల్ ప్రదేశ్ లలో ఒక్కొక్క స్థానానికి, తెలంగాణలో రెండుస్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.

## భాగ్యనగర పరిశుభ్రతపై సీఎస్ సీరియస్

మొదటి పేజీ తరువాయి

పరిశుభ్రంగా ఉంచాలని దిశానిర్దేశం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో అధికారులతో బుధవారం సీఎస్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ క్రమంలో గ్రేటర్ హైదరాబాద్ పరిశుభ్రతపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. భాగ్యనగరంలో రోజుకు 7,800 టన్నుల చెత్త సేకరణ జరుగుతోందన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో 4,500 స్వచ్ఛ ఆటోలతో ఇంటింటికీ చెత్త సేకరిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. 18,557 మంది శానిటేషన్ సిబ్బంది సేవలు అందిస్తున్నట్లు అధికారులు నివేదికలో ప్రస్తావించారు. తడి, పొడి చెత్త సేకరణ, ప్లాస్టిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టిసారించినట్లు స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులకు సీఎస్ రామకృష్ణారావు హెచ్చరించారు.

## ఢిల్లీ ఏఐ సమ్మిట్‌లో 'రోబోటిక్ డాగ్' రచ్చ




మొదటి పేజీ తరువాయి

రావాలనే ఉత్సాహంతో తప్పుడు సమాచారం ఇచ్చింది వాస్తవానికి మీడియాతో మాట్లాడే అధికార ప్రతినిధి కాదు అంటూ సర్ది చెప్పుకుంది యూనివర్సిటీయాజమాన్యం. ఢిల్లీలో జరుగుతున్న ఏఐ సమ్మిట్ లో ప్రదర్శించిన మంగళవారం గాల్గోటియాస్ యూనివర్సిటీ ప్రదర్శించిన రోబోటిక్ కుక్క వివాదాస్పదమైంది. ఈ రోబోటిక్ కుక్కను గల్గోటియాస్ లోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అభివృద్ధి చేసిందని యూనివర్సిటీ ప్రొఫెసర్ చెప్పడంతో వివాదం చెలరేగింది. ఈ రోబోటిక్ డాగ్ వాస్తవానికి యూనిట్రీ 2 అని చైనాకు చెందిన యూనిట్రీ రోబోటిక్స్ కంపెనీ తయారు చేసింది. విద్యా, పరిశోధనల్లో ప్రపంచవ్యాప్తంగా ప్రదర్శించబడింని హైలైట్ చేశారు. ఇక ఈ ఎపిసోడ్ వివాదంగా మారడంతో యూనివర్సిటీ స్టాల్ ఖాళీ చేయాలని ఆదేశించారు. తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న గల్గోటియాస్ యూనివర్సిటీ రోబోట్ ను తాము సృష్టించింది కాదని సంస్థ ఎప్పుడు అలా చెప్పుకోలేదని వివరణ ఇచ్చింది.

# ముద్ర యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఏ.సిద్ధార్థ్ రెడ్డి**



ములుగు జిల్లా, ఫిబ్రవరి 18 (తీన్మార్ న్యూస్): ప్రధానమంత్రి ముద్ర యోజన పథకాన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఏ.సిద్ధార్థ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ములుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ డి సి ఆధ్వర్యం లో ప్రధానమంత్రి ముద్ర యోజన పథకం పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఏ.సిద్ధార్థ్ రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏ.సిద్ధార్థ్ రెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి ముద్ర యోజన పథకాన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలని మరియు చిన్న తరహా వ్యాపారాలను ప్రోత్సహించడానికి ఈ పథకం ద్వారా ఎలాంటి గ్యారెంటీ పత్రాలు లేకుండానే కనిష్టంగా 50 వేల రూపాయల నుంచి గరిష్టంగా 20 లక్షల వరకు రుణ సదుపాయం కల్పించబడుతుందని తెలిపారు.ఆసక్తి కలిగిన అభ్యర్థులు జిల్లా పరిశ్రమ కేంద్రంలో సంప్రదించవచ్చని, దీనికోసం అభ్యర్థుల ధృవీకరణ పత్రాలు తమ వద్ద ఉంచుకోవాలని, ఇలాంటి అవకాశాలను స్థానిక నిరుద్యోగ యువత చిన్న తరహా పరిశ్రమలు స్థాపించాలనుకునేవారు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కొప్పుల మల్లేశ్వర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ జయప్రకాష్, డిస్టిక్ కోఆర్డినేటర్ వెంకన్న, ఈ డి సి మేనేజర్ విక్రమ్ , అసిస్టెంట్ మేనేజర్ శ్రీకాంత్, జూనియర్ అసిస్టెంట్ రామేందర్, రాధిక శిరీష పాల్గొన్నారు

# క్రీడల ద్వారా యువతలో క్రమశిక్షణ, స్నేహభావం పెరుగుతాయి



భూపాలపల్లి, ఫిబ్రవరి 18 (తీన్మార్ న్యూస్): నాచారం గ్రామంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌కు తెలంగాణ రాజ్యాధికార పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ హాజరయ్యారు. కొంపెల్లి లిటిల్ మాస్టర్స్ టీం ఆహ్వానం మేరకు కార్యక్రమానికి విచ్చేసిన ఆయన, అక్కడి క్రీడాకారులతో ఆత్మీయంగా మాట్లాడారు. ఈ సందర్భంగా రవి పటేల్ మాట్లాడుతూ క్రీడలు మానసిక మరియు శారీరక దృఢత్వానికి ఎంతో ఉపయోగకరమని తెలిపారు. క్రీడల ద్వారా యువతలో క్రమశిక్షణ, స్నేహభావం, జట్టు భావన పెరుగుతాయని అన్నారు. ముఖ్యంగా క్రికెట్ ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అత్యంత ఆదరణ పొందిన అద్భుతమైన ఆటగా కొనసాగుతోందని పేర్కొన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు తయారవ్వాలని ఆకాంక్షిస్తూ, క్రీడాకారుల అభివృద్ధికి తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. క్రీడాకారుల పరిచయం అనంతరం టోర్నమెంట్‌లో పాల్గొంటున్న ప్రతి టీంకు శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు.

# తెలంగాణ తల్లి గోస తీర్చిన ధీరుడు కేసీఆర్

**జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్**






హనుమకొండ, ఫిబ్రవరి 18 (తీన్మార్ న్యూస్): కేసీఆర్ 72వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ భద్రకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కేసీఆర్ గోత్ర నామాలతో వారి కుటుంబ సభ్యుల పేరిట అర్చనలు చేశారు. అనంతరం దేవాలయ ఎదుట ఉన్న నిరుపేదలకు దుప్పట్లు పంచిపెట్టారు. అదే విధంగా బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని కేక్ కటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, మాజీ పార్లమెంట్ సభ్యులు బోయినపల్లి వినోద్ కుమార్ తో కలిసి కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు తినిపించారు. ఈ సందర్భంగా నిరుపేద విద్యార్థులు ఇద్దరి ఫీజులు చెల్లించి వారికి రశీదులు అందజేశారు. దివ్యాంగులు నిర్వహించిన కేసీఆర్ జన్మదిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ ముమ్మాటికీ కేసీఆర్ తెలంగాణ జాతిపిత, 60 ఏండ్ల గోస తీర్చిన ఉద్యమ కెరటం కేసీఆర్, 14 ఏండ్ల స్వరాష్ట్ర పోరాటం, 10 ఏండ్ల పాలనలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపారు. కేసీఆర్ పాలనలో అన్ని వర్గాలకు సంక్షేమం అభివృద్ధి అందాయని తెలిపారు.

# రంజాన్ సందర్భంగా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఫిబ్రవరి 18 (తీన్మార్ న్యూస్): బుధవారం ఐడిఓసి కార్యాలయంలో మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 19 నుండి ప్రారంభం కానున్న రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, విద్యుత్, వైద్య, పంచాయతీరాజ్ మరియు ముస్లిం మత పెద్దలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మసీదులు, ఈద్గాలు మరియు సామూహిక నమాజ్ ప్రదేశాల్లో అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, తాగునీరు, వీధి దీపాలు, శుభ్రత వంటి అన్ని మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. మసీదుల వద్ద ప్రత్యేక పారిశుధ్య బృందాలను ఏర్పాటు చేసి, బ్లీచింగ్ పౌడర్ చల్లి పరిశుభ్రత చేయాలని, డస్ట్ బిన్స్ ఏర్పాటు చేయాలని పంచాయతి, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. రంజాన్ పర్వదినం నేపథ్యంలో తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని, వీధిలైట్లు పనిచేసేలా తక్షణ చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.

ప్రార్థన సమయాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. ఎక్కడైనా సమస్య వస్తే తక్షణ పునరుద్ధరణకు మండల స్థాయిలో వాట్సప్ గ్రూపు ఏర్పాటు చేయాలని, అకాలంగా అంతరాయం ఏర్పడితే ముందస్తు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రార్థనా స్థలాల వద్ద ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. పటిష్ట బందోబస్తు, పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. ముస్లిం ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం రంజాన్ మాసంలో నమాజ్ చేసుకోవడానికి వీలుగా కార్యాలయ సమయం ముగియడానికి ఒక గంట ముందుగా వెళ్లేందుకు అన్ని శాఖల అధికారులు అవకాశం కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, మైనారిటీ సంక్షేమ అధికారి డా పురందర్, ఆర్డిఓ హరికృష్ణ, కాటారం డిఎస్పీ సూర్య నారాయణ, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలి

**ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఫిబ్రవరి 18 (తీన్మార్ న్యూస్): లక్ష్మీ నరసింహ స్వామి జాతర బ్రహ్మోత్సవాలు, విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు.

బుధవారం రేగొండ మండలం కొడవటంచలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సంకీర్త్ తో కలిసి ఏర్పాట్లు పై పలు శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 18 నుండి 21 వరకు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి విగ్రహ పునః ప్రతిష్ఠ అలాగే ఈనెల 26 నుండి మార్చి 5 వ తేదీ వరకు జాతర బ్రహ్మోత్సవాలు నిర్వహణ జరుగుతుందని తెలిపారు. జాతర, బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. ఈనెల 21వ తేదీన త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి వారితో పాటు శాసన సభ స్పీకర్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యే లు ఇతర వీఐపీ లు స్వామి వారి దర్శనార్థం కొడవటంచ రానున్నారని అన్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది సుమారు 12 కోట్ల రూపాయలతో కొడవటంచ ఆలయం పునర్నిర్మాణం చేపట్టడం జరిగిందని కాబట్టి భక్తుల సౌకర్యార్థం త్రాగు నీరు, మరుగుదొడ్లు, నిరంతర విద్యుత్ సరఫరా, అందించాలని తెలిపారు.

తాత్కాలిక బస్టాండ్ ఏర్పాటు తో పాటు చుట్టుపక్కల జిల్లాల నుండి ఆర్టీసీ బస్సు సర్వీసులు నడపాలని సూచించారు. ఆలయ ఆవరణలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ సైతం అందుబాటులో ఉంచాలనిసూచించారు. అగ్నిమాపక శాఖ ద్వారా అగ్నిమాపక వాహనాలు అందుబాటులో ఉంచాలని తెలిపారు. కొడవటంచను కలుపుకొని ఉన్న ప్రధాన రహదారులకు ఇరువైపుల పిచ్చి మొక్కలు, ముళ్ళ పొదలు తొలగించాలని సూచించారు. వీఐపీలు, ఇతర ప్రైవేట్ వాహనాల పార్కింగ్ కోసం పార్కింగ్ స్థలాలను గుర్తించి సూచిక బోర్డు లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రోజు అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ

కొడవటంచ ఆలయం పునర్నిర్మాణం విగ్రహ పునః ప్రతిష్ఠ, జాతర బ్రహ్మోత్సవాలు సందర్భంగా అధికారులు అంకిత భావంతో విధులు నిర్వహించాలని తెలిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి జాతరను విజయవంతం చేయాలని స్పష్టంచేశారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో అధికారులు విధులు నిర్వహణకు అందుబాటులో ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఎస్పీ సంకీర్త్ మాట్లాడుతూ జాతర బ్రహ్మోత్సవాలు, పునః ప్రతిష్ఠ కార్యక్రమాలకు పటిష్ఠ బందోబస్త్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. వీఐపీల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేస్తామని జాతర కు వచ్చే భక్తులకు ఇబ్బంధులు తలెత్తకుండా పోలీసు శాఖ తరుపున అన్ని ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. అనంతరం మేళ తాళాలతో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సంకీర్త్ పునర్నిర్మాణం జరిపిన ఆలయం వద్ద గుమ్మడికాయ కొట్టి పూజా కార్యక్రమం నిర్వహించారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నల్లమలలో సంత్ సేవాలాల్ విగ్రహం

**మద్దిమడుగులో ఏర్పాటుకు స్థల పరిశీలన**

**దేశంలోనే అతిపెద్ద సంత సేవాలాల్ విగ్రహం**

**ఆధ్యాత్మిక టూరిజానికి ఊతం**

**మరో గోరియా ఘాడ్గా మారనున్న మద్దిమడుగు పుణ్యక్షేత్రం**

**ఎంపీ పోరిక బలరాం నాయక్**





మహబూబాబాద్, ఫిబ్రవరి 18 (తీన్మార్ న్యూస్): మంగళవారం బంజారాల సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే గిరిజనుల ఆరాధ దైవమైన సంత్ సేవాలాల్ మహరాజ్ విగ్రహం నిర్మిస్తామని మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి కేవస్ శ్రీనివాస్ రాజ్ తో కలిసి మంగళవారం మద్దిమడుగులో సంత్ సేవాలాల్ విగ్రహ స్థాపనకు ప్రతిపాదించిన 20 ఎకరాల స్థలాన్ని పరిశీలించి స్థానిక అధికారులతో అవసరమైన మౌలిక వసతులపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ బలరాం నాయక్ మాట్లాడుతూ గిరిజనుల అదృష్టంగా ముఖ్యమంత్రి సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహ నిర్మాణానికి గట్టి సంకల్పంతో ఉన్నారని అన్నారు. సమ్మక్క సారక్క జాతర తరహాలో మద్దిమడుగు అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని సంత్ సేవాలాల్ విగ్రహాలను ఆదర్శంగా తీసుకుని నల్లమల అటవీ ప్రాంతంలో నిర్మించబోయే విగ్రహం దేశస్థాయి ప్రతిష్టను పొందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, జిల్లా కలెక్టర్ బాదవత్ సంతోష్ తదితరులు ఉన్నారు.

# ఎస్ ఎస్ సి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి

**జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**



హనుమకొండ జిల్లా, ఫిబ్రవరి 18 (తీన్మార్ న్యూస్): పదో తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పకడ్బందీగా ఏర్పాట్లను పూర్తిచేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియట్, పదో తరగతి వార్షిక పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లు, నిర్వహణ అంశాలపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ పరీక్షా సమయానికి ముందే విద్యార్థులు పరీక్షా కేంద్రాల్లో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని, అందుకు విద్యార్థులకు అవగాహన కల్పించాలని అన్నారు. పరీక్షా సమయంలో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని, అవసరమైన చోట్ల ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. జిల్లాలో 52 సెంటర్లలో మొదటి సంవత్సరం విద్యార్థులు 18,590 మంది పరీక్షలు రాయడం జరుగుతుందని, అదేవిధంగా20004 మంది విద్యార్థులు రెండవ సంవత్సరం పరీక్షలు రాయడం జరుగుతుందని పేర్కొన్నారు. అందుకుగాను పరీక్షా కేంద్రాలలో శానిటేషన్,, త్రాగునీరు,తదితర సదుపాయాలు కల్పించడంతోపాటు ప్రతి సెంటర్లో రెండు నుంచి మూడు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. పరీక్షా కేంద్రాల్లో ఎటువంటి సెల్ ఫోన్లు అనుమతించబడవని అంతేకాకుండా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిరంతరం ఫ్లయింగ్ స్క్వాడ్ పర్యవేక్షణలో పరీక్షలు సజావుగా సాగేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. పరీక్ష సమయానికి ముందు కస్టోడియన్ అధికారులు పోలీసు వారి సహకారంతో పరీక్షా కేంద్రాలకు ప్రశ్న పత్రాలు పంపడం జరుగుతుందని అన్నారు. మార్చి 14 నుండి నిర్వహించే ఎస్ ఎస్ సి వార్షిక పరీక్షలకు జిల్లాలో 64 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు జరిగిందని 12 079 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. ఆయా పరీక్ష కేంద్రాలు మౌలిక వసతులు పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

## వంద శాతం పురోగతే లక్ష్యం

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



జనగాం జిల్లా, ఫిబ్రవరి 18 (తీన్మార్ న్యూస్): పేద మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహం అందిస్తున్నదని జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా పేక్ అన్నారు. శ్రీ నిధి క్రెడిట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ పని తీరు, ఆర్థిక ప్రణాళికలు, బ్యాంకు లింకేజి రుణాల పై బుధవారం కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్ లో సంబంధిత అధికారులతో రివ్యూ కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రెడిట్ ప్లాన్ మీద ప్రత్యేక దృష్టి పెట్టాలని, వేగవంతంగా లోన్ రికవరీ చేయాలని అధికారులను సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరం నెలరోజులు ఉన్నందున ఏపీఎం, సీసీ లకు ఉన్న లక్ష్యాలని చేరుకోవాలన్నారు స్త్రీ నిధి రుణాల టార్గెట్ వంద శాతం ప్రగతి సాధించాలని, రికవరీ చేసే విషయం లో ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మహిళా సంఘాల కి ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహంకి సంబందించిన.. ఈ ఆర్థిక సంవత్సరం లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలన్నారు. అలాగే బ్యాంకు లింకేజి కి సంబందించి ప్రతీ మండలం యాక్షన్ ప్లాన్ పెట్టుకొని 15 రోజుల్లో టార్గెట్ చేరుకోవాలన్నారు. బ్యాంకు లింకేజి రుణాలు SHG సభ్యులకు మంజూరు చేసే విషయం లో LDM, APD లు సంయుక్తంగా సంబంధిత బ్యాంకు లను సందర్శించి మండలవారీగా ఇచ్చిన టార్గెట్ ప్రకారం గా రుణాలు మంజూరు అయ్యేలా పర్యవేక్షించాలన్నారు. ఈ సమావేశంలో, డి ఆర్డీ ఓ వసంత, ఏ పి డి నూరిద్దిన్, జిల్లా సమైఖ్య అధ్యక్షులు, ఓబీ సభ్యులు, స్త్రీ నిధి రీజినల్ మేనేజర్ ప్రమీల, అసిస్టెంట్ మేనేజర్ లు, అన్ని మండలాల ఏపీఎం లు, సీసీ లు, జనగాం, స్టేషన్ ఘనపూర్ మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్ష

వరంగల్ జిల్లా, ఫిబ్రవరి 18 (తీన్మార్ న్యూస్): జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం జిల్లా కలెక్టర్ డా. సత్య శారదా అధ్యక్షతన వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించబడింది. సమావేశానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి. సాంబశివరావు, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు, ప్రోగ్రాం అధికారులు, వైద్యాధికారులు మరియు సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ప్రతి సిబ్బంది బయోమెట్రిక్ విధానం ద్వారా సమయపాలన పాటిస్తూ విధులకు హాజరై ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు అవసరమైన పరీక్షలు, చికిత్సలు, వైద్య సలహాలు సమగ్రంగా అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. సంక్రమిత మరియు అసంక్రమిత వ్యాధుల నివారణ, మాతా–శిశు సంరక్షణ, రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమం, కిశోర ఆరోగ్య కార్యక్రమం తదితర పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వ వైద్య సంస్థల్లో ఎటువంటి సమస్యలు ఉన్నా వెంటనే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో అనధికారిక సిజేరియన్ ఆపరేషన్లు, గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వైద్య రంగంలో పారదర్శకత, నాణ్యత, ప్రజలకు సులభ ప్రాప్తి లక్ష్యంగా పని చేయాలని పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి. సాంబశివరావు మాట్లాడుతూ, కలెక్టర్ ఆదేశాలను కచ్చితంగా అమలు చేస్తూ, విధి నిర్వహణలో ఎటువంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా ప్రజలకు ఉత్తమ వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డా. ప్రకాష్, డా. కొమురయ్య, ప్రోగ్రాం అధికారులు డా. ఇగ్భత్ అహ్మద్, డా. సరిత, డా. ప్రసన్నలక్ష్మి, డా. రవీందర్ తదితరులు పాల్గొన్నారు.




## మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ పనితీరుపై సమీక్ష




వరంగల్ జిల్లా, ఫిబ్రవరి 18 (తీన్మార్ న్యూస్): జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ పనితీరుపై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారీ, జిల్లాలోని అన్ని సి డి పి ఓ లు మరియు సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలపై సూపర్‌వైజర్లు నిర్వహిస్తున్న సందర్శనలపై ప్రత్యేకంగా సమీక్ష చేపట్టారు. ప్రతి సూపర్‌వైజర్ తగిన విధంగా, నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శిస్తూ, ప్రభుత్వ సూచించిన సూచికల్లో స్పష్టమైన పురోగతిని నమోదు చేయాలని ఆదేశించారు. కేవలం రికార్డుల పరిమితి కాకుండా, భౌతిక పరిశీలనతో పాటు సేవల నాణ్యత, పిల్లల హాజరు, పోషణ స్థాయి, ప్రీ-స్కూల్ కార్యకలాపాల అమలు వంటి అంశాలపై దృష్టి పెట్టాలని సూచించారు. పనితీరులో నిర్లక్ష్యం, లక్ష్యాలు సాధించడంలో వెనుకబడిన కొంతమంది సూపర్‌వైజర్లపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ, వారి నుంచి తక్షణ వివరణ కోరారు. భవిష్యత్తులో ఇలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హెచ్చరించారు. అలాగే, జణూలాలు తమ ప్రాజెక్టు పరిధిలోని కేంద్రాలకే పరిమితం కాకుండా, ఇతర ప్రాజెక్టుల పరిధిలోని ఎంపిక చేసిన అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి, సేవల అమలు స్థితిగతులపై సమగ్ర నివేదిక సమర్పించాలని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ విధానం ద్వారా పారదర్శకత, బాధ్యతాయుత వ్యవహారం మరియు పనితీరులో పోటీ భావన పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి అంగన్‌వాడీ కేంద్రం జిల్లా అభివృద్ధి సూచికల ప్రతిబింబమని, సూపర్‌వైజర్లు మరియు జణూలాలు తమ పర్యవేక్షణను మరింత కట్టుదిట్టంగా నిర్వహించి, తక్కువ పనితీరు కనబరుస్తున్న కేంద్రాలను గుర్తించి, తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమిష్టి కృషితో వరంగల్ జిల్లాను మహిళా మరియు శిశు సంక్షేమ కార్యక్రమాలలో రాష్ట్ర స్థాయిలో ఆదర్శ జిల్లాగా నిలపాలని పిలుపునిచ్చారు జిల్లా సంక్షేమ అధికారి మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాలు బాలల భవిష్యత్తుకు పునాది వంటివని, గర్భిణీ మరియు బాలింతలకు అందించే పోషణ సేవలు సమయానుసారంగా, నాణ్యతతో అందించాల్సిన బాధ్యత అందరిదీ అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మహిళ శిశు సంక్షేమ శాఖ అధికారులు, సిడిపిఓలు అంగన్వాడి కార్యకర్తలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని ఆదుకున్న శ్రీరామకృష్ణ సేవా ట్రస్ట్ చైర్మన్



మంగపేట, ఫిబ్రవరి 18 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లా మంగపేట మండలం బాలన్న గూడెం గ్రామంలో ఇటీవల అనారోగ్య సమస్యతో మరణించిన తోలేం రాములు బాలన్న గూడెం గ్రామ అధ్యక్షులు పోదేం రాంబాబు, ఎగ్గడి అర్జున్ తోలం రాములు కుటుంబ పరిస్థితిని శ్రీరామకృష్ణ సేవా ట్రస్ట్ చైర్మన్ నాగ రమేష్ కి తెలియజేయగా విషయం తెలుసుకొని చెలించిన రామకృష్ణ సేవా ట్రస్ట్ చైర్మన్, ములుగు జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి బాడిస నాగ రమేష్, ఆ కుటుంబ సభ్యులకు అరకింట బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పూసల నరసింహారావు, జై భీమ్ రామ్మోహన్, యాలం శ్రీను, పోదాం భూషణం, రవీందర్, యలం సమ్మక్క, పోదాం రాంబాబు, చలమయ్య పాల్గొన్నారు

## జడ్.పి.హెచ్.ఎస్ లలో ఆకస్మిక తనిఖీలు




మహబూబాబాద్ జిల్లా, ఫిబ్రవరి 18 (తీన్మార్ న్యూస్): బుధవారం జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, మహబూబాబాద్ మండలం పర్వతగిరి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల, కురవి మండలం నేరేడ జడ్.పి.హెచ్.ఎస్ లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు అందిస్తున్న విద్య బోధనలను స్వయంగా పరిశీలించారు. నూతన టెక్నాలజీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ తరగతుల ద్వారా విద్యా బోధనలు అందించాలని, రానున్న పదవ తరగతి పరీక్షల్లో అన్ని విద్యాసంస్థలలో ఉత్తమ ఫలితాలు సాధించడం కోసం ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి విద్యార్థిని విద్యార్థుల యొక్క ప్రతిభను వెలికి తీయాలని సూచించారు. పిల్లలు, ఉపాధ్యాయుల హాజరు శాతం పక్కాగా ఉండే విధంగా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. నాణ్యమైన డైట్ మెనూ అమలు చేయాలని సూచించారు, హెల్త్, ఎడ్యుకేషన్, న్యూట్రిషన్ లపై పిల్లలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు. అంతకుముందు పాఠశాల ఆవరణంలోని కిచెన్ షెడ్ డైనింగ్ హాల్ మరుగుదొడ్లు తరగతి గదులు పరిశీలించారు. భోజనం సిద్ధం చేసే సిబ్బంది తగిన జాగ్రత్తలు వహిస్తూ ఉండాలని, విద్యార్థిని, విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటన సమయంలో అన్ని సంక్షేమ వసతి గృహాలు, విద్యాసంస్థలను తనిఖీలు నిర్వహించాలనీ సూచించారు.

## అధికారులు రైతుల పట్ల సానుభూతితో వ్యవహరించండి



పెద్దపల్లి, ఫిబ్రవరి 18 (తీన్మార్ న్యూస్): పెద్దపల్లి మండలం రాగినేడు గ్రామ సహకార సంఘం గోదాం వద్ద యూరియా పంపిణీలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై గ్రామ సర్పంచ్ సోమకుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం గోదాంను సందర్శించిన ఆయన, ఎరువుల కోసం పడిగాపులు కాస్తున్న రైతుల అవస్థలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ సోమకుమార్ మాట్లాడుతూ రైతుల పట్ల అధికారులు సానుభూతితో వ్యవహరించాలని, సాంకేతిక కారణాలు చెప్పి వారిని ఇబ్బంది పెట్టడం సరికాదని హితవు పలికారు. ముఖ్యంగా ఫోన్ నెంబర్ లింక్ కాకపోవడం, దూర ప్రాంతంలో ఉన్నవారు ఓటిపిలు చెప్పకపోవడం , పాస్ బుక్ రాకపోవడం వంటి సమస్యల వల్ల రైతులు రోజుల తరబడి గోదాం చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన సమయంలో పంటకు యూరియా అందకపోతే దిగుబడి రాదని, తాము తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యను ఇప్పటికే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లానని, ఆయన సానుకూలంగా స్పందించి రైతులకు తక్షణమే సహకరించాలని అధికారులను ఆదేశించారని తెలిపారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అధికారులు సమన్వయంతో పనిచేసి, రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా యూరియా పంపిణీని వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. పంట కాలాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు మొండివైఖరి వీడి రైతులకు అండగా నిలవాలని, లేనిపక్షంలో రైతుల పక్షాన నిలబడి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని" స్పష్టం చేశారు.

# ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళిక అమలు చేయాలి

**పదో తరగతి విద్యార్థులందరిని జూనియర్ కళాశాలతో అనుసంధానం చేయాలి**

**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఫిబ్రవరి 18 (తీన్మార్ న్యూస్): జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రతి పదో తరగతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా కట్టుదిట్టమైన కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. పదో తరగతి ఉత్తీర్ణత శాతం పెంపు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాల పెంపు, పాఠశాలల్లో త్రాగునీటి, మరుగుదొడ్ల సౌకర్యాల మెరుగుదల తదితర అంశాలపై బుధవారం ఐడీఓసీ కార్యాలయంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి అదనపు కలెక్టరు డి వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మితో కలిసి ఎంఈఓలు, ఏపీఎంలు, సంబంధిత శాఖల అధికారులతో జూమ్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత విద్యా సంవత్సరపు ఫలితాల విశ్లేషణలో గణితం, సైన్స్, తెలుగు విషయాలలో విద్యార్థులు వెనుకబడినట్టు గమనించామని తెలిపారు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ప్రీ-ఫైనల్ పరీక్షల ఫలితాల ఆధారంగా చదువులో వెనుకబడిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు రెండు రోజుల్లో గుర్తించి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. గ్రామ స్థాయిలో మహిళా సమాఖ్య సభ్యులు కూడా విద్యార్థుల విజయంలో భాగస్వాములు కావాలని, అవసరమైతే వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించాలని తెలిపారు . సాయంత్రం నిర్వహించే స్టడీ అవర్స్‌ను విఓఏ లు పర్యవేక్షించాలని సూచించారు. ఆకాంక్షిత విద్యార్థుల కోసం ప్రత్యేక ప్రశ్నాపత్రాలు, పాఠ్యసామగ్రిని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సిద్ధం చేసి అందించాలని తెలిపారు. బాలికలతో పోలిస్తే బాలుర ఉత్తీర్ణత శాతం తక్కువగా ఉన్న నేపథ్యంలో వారి హాజరు శాతం పెంపునకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రతి పదో తరగతి విద్యార్థిని సమీప ప్రభుత్వ జూనియర్ కళాశాలతో అనుసంధానం చేయాలని, అందుబాటులో ఉన్న కోర్సులు, సౌకర్యాల వివరాలతో కరపత్రాలు పంపిణీ చేయాలని సూచించారు. పేద కుటుంబాల విద్యార్థులు ప్రైవేట్ కళాశాలల్లో చేరి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనకుండా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనే ప్రవేశాలు పొందేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో త్రాగునీటి సౌకర్యాలు సమృద్ధిగా ఉండేలా చూడాలని, మిషన్ భగీరథ అధికారులతో సమన్వయం చేసుకొని అవసరమైన మరమ్మత్తులు తక్షణమే పూర్తి చేయాలని అన్నారు. పదో తరగతి పరీక్షల ప్రారంభానికి ముందే అన్ని ఉన్నత పాఠశాలల్లో త్రాగునీటి సదుపాయం ఉండేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన వివరాలను నివేదికల రూపంలో సమర్పించాలని ఆదేశించారు.


బాలికల మరుగుదొడ్లు లేని పాఠశాలలు ఏవీ ఉండకూడదని స్పష్టం చేస్తూ త్రాగునీటి, మరుగుదొడ్ల మరమ్మత్తులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 30 సంవత్సరాల లోపు పదో తరగతి, ఇంటర్, ఐటీఐ ఉత్తీర్ణుల వివరాలు, వారు ప్రస్తుతం నిర్వహిస్తున్న ఉపాధి/వృత్తి సమాచారంతో వీఓఏలు సమగ్ర నివేదిక రూపొందించి సమర్పించాలని సూచించారు. నిరుద్యోగ యువతను గుర్తించి వారికి నైపుణ్య శిక్షణ కల్పించి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు చేపడతామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్, విద్యాశాఖ కోఆర్డినేటర్ సతీష్ సంబంధిత శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన పీఏసీఎస్ మాజీ చైర్మన్



మంగపేట, ఫిబ్రవరి 18 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లా మంగపేట మండలానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పీఏసిఎస్ మాజీ చైర్మన్ తోట రమేష్ ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంత్రి సీతక్క వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు కాంగ్రెస్ పార్టీలో వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ స్టేట్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య,మంగపేట మండల పార్టీ అధ్యక్షుడు మైల జయరాం రెడ్డి,నాయకులు పాల్గొన్నారు


## సి ఎం ఆర్ ఎఫ్ చెక్కును అందజేసిన ఎమ్మెల్యే



మణుగూరు, ఫిబ్రవరి 18 (తీన్మార్ న్యూస్): పినపాక మండలం జనంపేటకు చెందిన బలుగురి నాగేశ్వరరావుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన ఆర్థిక సహాయం చెక్కును ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు.

అనారోగ్యం మరియు అత్యవసర వైద్య చికిత్సల కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందిస్తున్న సహాయం ఎంతో ఉపయుక్తమని ఎమ్మెల్యే తెలిపారు. అర్హులైన ప్రతి పేద కుటుంబం ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేలా తాను కట్టుబడి ఉన్నానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారు కుటుంబ సభ్యులు ఆర్థిక సహాయం అందించిన ముఖ్యమంత్రికి, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, అవసరమైన వారికి ప్రభుత్వ సహాయం అందేలా అధికారులు చురుకుగా పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు.

## యూరియా విక్రయాలు, రైతు బీమా, స్కీముల మీద సమీక్ష



వరంగల్ జిల్లా, ఫిబ్రవరి 18 (తీన్మార్ న్యూస్): జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో బుధవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు అనురాధతో పాటు వ్యవసాయ విస్తరణ అధికారులుతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ విడియో కాన్ఫరెన్స్ లో ఫార్మర్ రిజిస్టరీ, క్రాబ్ బుకింగ్ యూరియా నిల్వలు మరియు విక్రయాలు, రైతు బీమా మొదలగు స్కీముల మీద సమీక్ష నిర్వహించారు. ఈ విడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి తప్పులు లేకుండా రైతులు వేసిన పంటలను ప్రతి ఏ ఈ ఓ లు సందర్శించి సర్వే నంబర్ల వారీగా పంటల వివరాలు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఏఈఓ లు వారి పరిధిలోని అన్ని గ్రామాలలో రైతుల రిజిస్టర్ కి సంబంధించిన పెండింగ్ రైతుల వివరాలు అన్ని సేకరించి ఐడీ క్రియేట్ చేయాలని అన్నారు. యూరియా రైతులకి అందే విధంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని పిఎసిఎస్ లలో నిలువలు ఉండేలా చూడాలని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులకు అవసరమున్న మేరకే ఎరువులు మరియు పురుగుమందులు వినియోగించేలా మరియు రైతులకు సేంద్రియ వ్యవసాయం పై శిక్షణ ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సంబంధిత క్షేత్ర స్థాయి వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.

## బఫర్ గోదాంలో అదనపు కలెక్టర్ తనిఖీ



హనుమకొండ జిల్లా, ఫిబ్రవరి 18 (తీన్మార్ న్యూస్): హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి కమలాపూర్ లోని బఫర్ గోదాంను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రవి మాట్లాడుతూ ఎంఎల్ఎస్ పాయింట్స్ కి వెళ్లే రైస్ లో అక్కడక్కడ బ్రోకెన్ రైస్ వస్తున్నాయని, వీటిపై కంప్లైంట్ వస్తున్నాయని ఇలాంటి కంప్లైంట్ మళ్ళీ రాకుండా చూసుకోవాలని అన్నారు. గోదాం నిర్వహణ, ఉద్యోగుల పని తీరు గురించి తెలుసుకొని పలు సూచనలు చేయడం జరిగింది. ఎలాంటి కంప్లైంట్స్ రాకుండా చూసుకోవాలని సూచించారు. ప్రజా పంపిణీ విధానం, అంగన్ వాడి కేంద్రాలకు, హాస్టళ్లకు సరఫరా అయ్యే బియ్యం కాబట్టి సక్రమంగా నిర్వహిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఎలాంటి అలసత్వం వహించకూడదని హెచ్చరించడం జరిగింది. ఏమైనా అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా జిల్లా పౌర సరఫరాల అధికారి వాజిద్ అలీ, సివిల్ సప్లై కార్పొరేషన్ మేనేజర్ మహేందర్, తహసీల్దార్ సురేష్ కుమార్, సివిల్ సప్లై డీటీ వేణుగోపాల్, సదానందం పాల్గొన్నారు.

## మైనారిటీ కౌన్సిలర్లను సన్మానించిన మైనారిటీ జర్నలిస్టులు

**మైనారిటీ ప్రజాప్రతినిధులకు ఆత్మీయ సన్మానం**



సూర్యాపేట, ఫిబ్రవరి 18 (తీన్మార్ న్యూస్): పట్టణానికి చెందిన మైనారిటీ సీనియర్ జర్నలిస్టులు మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా మరియు పలువురు నూతనంగా ఎన్నుకోబడిన వార్డు కౌన్సిలర్లను ఆత్మీయంగా సన్మానించారు. ఎలాంటి సభ నిర్వహించకుండా, సాదాసీదా వాతావరణంలో పరస్పర గౌరవంతో ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించడం విశేషం. ప్రజాసేవలో ముందుండి కృషి చేస్తున్న ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతాభివందనంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లాకి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. అలాగే 2వ వార్డు కౌన్సిలర్ సయ్యద్ తన్వీర్ హుస్సేన్, 16వ వార్డు కౌన్సిలర్ షేక్ జహీర్, 34వ వార్డు కౌన్సిలర్ తాహెర్ బిన్ మన్సూర్, 36వ వార్డు కౌన్సిలర్ షేక్ మన్సూర్ బి (ఫారుక్) వారిని కూడా సన్మానించి అభినందనలు తెలిపారు.

**జర్నలిస్టుల అభినందనలు**

మైనారిటీ సీనియర్ జర్నలిస్టులు జహంగీర్, రషీద్, పాషా, జహీర్, నజీర్ ఖాన్ తదితరులు మాట్లాడుతూ, మైనారిటీ వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం లభించడం సమాజానికి గర్వకారణమని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న ప్రజాప్రతినిధులను ప్రశంసించారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం మీడియా బాధ్యత అయితే, ప్రజల కోసం నిబద్ధతతో పనిచేసే నాయకులను ప్రోత్సహించడం కూడా తమ కర్తవ్యమేనని తెలిపారు.

**వైస్ చైర్మన్ షఫీ ఉల్లా స్పందన**

వైస్ చైర్మన్ షఫీ ఉల్లా మాట్లాడుతూ... "ఈ సన్మానం నాకు మరింత బాధ్యతను గుర్తు చేస్తోంది. ప్రజలు నాపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం నా ప్రధాన కర్తవ్యం. మైనారిటీ వర్గాల అభ్యున్నతి, యువత ఉపాధి అవకాశాలు, విద్యా ప్రోత్సాహం, మహిళల సాధికారత కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగుతున్నాం. ప్రతి వార్డులో తాగునీరు, రహదారులు, పారిశుధ్యం, కాలువల అభివృద్ధి, వీధిదీపాల ఏర్పాటు వంటి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం" అని పేర్కొన్నారు. కౌన్సిలర్ల హామీలు 2వ వార్డు కౌన్సిలర్ సయ్యద్ తన్వీర్ హుస్సేన్ మాట్లాడుతూ ప్రజలతో సమన్వయం కొనసాగిస్తూ వార్డు సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. 16వ వార్డు కౌన్సిలర్ షేక్ జహీర్ మాట్లాడుతూ ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని అన్నారు. 34వ వార్డు కౌన్సిలర్ తాహెర్ బిన్ మన్సూర్ మాట్లాడుతూ యువత, మహిళల సంక్షేమం కోసం కృషి చేస్తామని చెప్పారు. 36వ వార్డు కౌన్సిలర్ షేక్ మన్సూర్ బి (ఫారుక్) పారిశుధ్యం, తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. సమన్వయానికి బాట ఈ సన్మాన కార్యక్రమం జర్నలిస్టులు --ప్రజాప్రతినిధుల మధ్య పరస్పర గౌరవం, ఐక్యతను బలోపేతం చేసింది. ప్రజా సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించేందుకు మీడియా-- ప్రభుత్వం కలిసి పనిచేయాలనే సంకల్పం వ్యక్తమైంది. సాధారణంగా నిర్వహించిన ఈ సన్మాన కార్యక్రమం సమాజంలో ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. ప్రజాసేవలో మరింత నిబద్ధతతో ముందుకు సాగాలని అందరూ ఆకాంక్షించారు.

## ప్రమాదాల, మాదక ద్రవ్యాల నివారణకు సమన్వయంతో పనిచేయాలి

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్**



జనగామ జిల్లా, ఫిబ్రవరి 18 (తీన్మార్ న్యూస్): రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా జిల్లా పరిధిలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఆదేశించారు. బుదవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో రోడ్డు భద్రత, మాదక ద్రవ్యల వినియోగ నివారణ మీద తీసుకున్న చర్యలపై సంబంధిత అధికారులతో జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, డిసిపి రాజమహేంద్ర నాయక్, ఎసిపి లతో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూఏరోడ్డు భద్రత అనేది ఒక శాఖ కు చెందినది కాదని అన్ని శాఖలు సమన్వయంతో పని చేసినప్పుడే ప్రమాదాలను నివారించవచ్చన్నారు

ప్రమాదాల నివారణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అవసరమైన చోట బారికేడింగ్‌లు ఏర్పాటుతో పాటు స్ట్రీట్ లైట్లు వెలిగే విధంగా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. గుంతలు పడ్డ రోడ్లను సత్వరమే మరమ్మతులు చేపట్టే అంశాలకు ప్రాధాన్యతను ఇవ్వాలని, అలాగే సూచిక బోర్డులు లేని ప్రదేశాల్లో ప్రయాణికులకు కనిపించే విధంగా పెద్ద సైజ్‌లో బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో విస్తృత స్థాయిలో అవగహాన కల్పిస్తే రోడ్డు ప్రమాదాలు తగ్గుటకు అస్కారం వుంటుందని, రోడ్డు ప్రమాదాల నివాణకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం డ్రగ్స్ నివారణ మీద కలెక్టర్ రివ్యూ చేస్తు మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడం అందరి బాధ్యతని జ తెలిపారు. సర్పంచ్ లకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో డ్రగ్స్ పైన పోలీస్ అధికారులు ఒక సెషన్ ని తీసుకోని గ్రామాల్లో మాదక ద్రవ్యాల రవాణా, వాడకాలను నిరోధించడం పైన అవగాహన కల్పించాలన్నారు. ప్రతీ బుధవారం అన్ని మండలాల్లో జరుగుతున్న ఉజ్వల కార్యక్రమంలో కూడా పోలీస్ అధికారులు డ్రగ్స్ పైన అవగాహన కల్పించాలన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలకు నేటి యువత బానిసలై తమ ఉజ్జ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, జిల్లాలో యువత మాధకద్రవ్యాల బారిన పడకుండా ఉండేలా అన్ని పాఠశాలలు, కళాశాలల్లో మాదకద్రవ్యాల వినియోగం కారణంగా కలిగే దుష్ప్రభావాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లాను మాదకద్రవ్య రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమైనదని, ప్రజలను ప్రధాన భాగస్వాములను చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. డ్రగ్స్ అనర్ధాలపై విద్యార్థి దశలో అవగాహన కల్పించాలని గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలను విక్రయించిన వారికి, వినియోగించిన వారికి పడే శిక్షల పైన పోలీస్, సంబంధిత శాఖలు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గంజాయి సరఫరాను నియంత్రించేందుకు ఎక్సైస్, పోలీస్ తదితర శాఖలు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో రోడ్లు మరియు భవనాల, రవాణా శాఖ, పోలీసు, నేషనల్ హైవే, ఆర్టీసీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అద్భుతంగా ఎన్డిఆర్ఎఫ్, మెడికల్, ఫైర్ మాక్ డ్రిల్

**వరదల సమయంలో**

**జాగ్రత్త చర్యల పైన అవగహన**

**విపత్తుల సమయం లో ధైర్యం గా ఉండాలి**

**రక్షణ చర్యల పైన అవగాహన ముఖ్యం**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



జనగాం జిల్లా, ఫిబ్రవరి 18 (తీన్మార్ న్యూస్): అకాల వర్షాలు, విపత్కర పరిస్థితుల సమయంలో తీసుకోవలిసిన చర్యల పైన ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ప్రజల్లో విపత్తుల పట్ల అవగాహన కల్పించాలన్న ఉద్దేశ్యం తో హైదరాబాద్‌కు చెందిన 10వ బెటాలియన్ నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందం ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ ముఖేష్ కుమార్, సెకండ్ ఇన్‌చార్జ్ ఏఎస్సై రొడ్డా మద్దిలెట్టి బృందం లోని హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్ ఇతర సిబ్బంది. అలాగే జిల్లా మెడికల్ కాలేజ్ బృందం, జిల్లా అగ్ని మాపాక శాఖ అధికారులు అకాల వర్షాల వల్ల వరదలు సంభవించినప్పుడు. ప్రజలు ఎలా అప్రమత్తంగా ఉండాలి, తక్షణమే ఎలా స్పందించి ఎలా బయట పడాలి అనే తదితర అంశాల పైన బుధవారం నెల్లూట్ల చెరువు వద్ద చక్కటి మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ కుండపోతగా వర్షాలు కురిసి వరదలు సంభవించినప్పుడు ప్రజలు భయపడకుండా ధైర్యంగా ఉండాలన్నారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు అలర్ట్ గా ఉండాలని వరదల్లో చిక్కుకున్నప్పుడు ఎలా బయట పడాలో తెలుసుకునేందుకు ఈ మాక్ డ్రిల్ కార్యక్రమం ఎంత గానో దోహదపడుతుందన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో విపత్తు నివారణలో భాగంగా ప్రాణ నష్టాలను నివారించడంలో ఎన్ డి ఆర్ ఎఫ్, మెడికల్, ఫైర్ అధికారుల పాత్ర కీలకమన్నారు. అనంతరం ఎన్ డి ఆర్ ఎఫ్, మెడికల్ బృందం, వరదల్లో చిక్కుకున్న ప్రజలు ఎలా బయటపడాలి. ఈత వచ్చినవారు, అలాగే ఈత రాని వారు ఎలాంటి ట్రిక్స్ ని పాటించాలి. ఎవరి ప్రాణాలకైనా ముప్పు వాటిల్లితే వారిని ఎలా కాపాడాలి, తక్షణమే తీసుకోవలిసిన చర్యల పైన ప్రాక్టీకల్ గా చక్కగా వివరించారు. అలాగే అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఆ పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలి, గృహల్లో గ్యాస్ వాడకం పట్ల ఎలా జాగ్రత్తగా ఉండాలి అనే అంశాల మీద అగ్ని మపాక అధికారులు సవివరంగా తెలిపారు. ఈ మాక్ డ్రిల్ నిర్వహణ వల్ల చాలా అవగాహన కలిగిందని ఇలాంటి కార్యక్రమాలు భయాలను తొలిగించి తక్షణమే తీసుకోవలిసిన చర్యలను సులభంగా అర్ధం చేసుకునే అవకాశాన్ని కలిగిస్తాయని అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్, ఆర్డివో గోపిరామ్, వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు, లింఘాల ఘనపూర్ తహసీల్దార్, సిజెఐటీలో జరుగుతున్న ట్రైనింగ్ లో ఉన్న 5 మండలాల సర్పంచ్ లు(చిల్పూర్, స్టేషన్ ఘనపూర్, జాఫర్ఘడ్, రఘునాథ్ పల్లి,లింఘాల ఘనపూర్) పాల్గొన్నారు.

## ముని్సిపల్ ఎన్నికల్లో బీసీల జైత్రయాత్ర

**61 శాతం స్థానాల్లో ఘనవిజయం**

**42 శాతం రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాలి**

**కేంద్రానికి బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ విజ్ఞప్తి**



హైదరాబాద్, ఫిబ్రవరి 18 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో జరిగిన పురపాలక ఎన్నికల్లో బీసీలు మొత్తంగా 61%కు పైగా గెలవటం పట్ల బీసీ కమిషన్ ఛైర్మన్ జి. నిరంజన్, సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో, మున్సిపల్ వార్డులలో బీసీలకు 28.22%, మున్సిపల్ కార్పొరేషన్‌లలో మొత్తం వార్డులలో 35.25% బీసీలకు కేటాయించినా జనరల్ స్థానాలలో కూడా బీసీలు గెలిచి, మొత్తం మీద 61% గెలవటం బీసీ వర్గాల ప్రజలలో పెరిగిన చైతన్యానికి నిదర్శనం అని పేర్కొన్నారు. ఈ మేరకు బీసీ కమిషన్ బుధశారం ఓ ప్రకటన విడుల చేసింది. పంచాయితి, మున్సిపాలిటీ ఎన్నికల్లో బీసీలు గెలిచిన స్థానాలను దృష్టిలో పెట్టుకొని కేంద్రం 42% రిజర్వేషన్లకు అమలు చేయడానికి అనుమతినివ్వాలని, 9వ షెడ్యూల్‌లో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 42% బీసీలకు రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లు పాస్ చేసినా అది ఇంకా కేంద్ర ప్రభుత్వంలో పెడ్డింగ్‌లో ఉండటం, కొందరు కోర్టు కెళ్లి ఈ రిజర్వేషన్ అమలు కాకుండా చేయడం సముచితం కాదని అభిప్రాయపడ్డారు. కోర్టుల్లో కేసులు వేసిన వారు కూడా వారి కేసులను ఉపసంహరించి చట్టబద్ధంగా బీసీల రిజర్వేషన్లు సాకారమయ్యే మార్గం సుగమం చేయాలని బీసీ కమిషన్ కోరుకుంటందని తెలిపారు. ఇటీవల జరిగిన పంచాయితీ ఎన్నికల్లో జనరల్ స్థానాలలో కూడా బీసీ అభ్యర్థులు 52.75% గెలిచారని, రాబోయే జెడ్పీటీసీ, ఎంపీటీసీ, జీహెచ్ఎంసీ, కార్పోరేషన్ల ఎన్నికల్లో కూడా బీసీలు అత్యధికంగా గెలుస్తారనే ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జరిగిన సమగ్ర సర్వేలో బీసీల సంఖ్య 56.33% అని తేలిందన్నారు.

## ఐ బొమ్మ రవికి బెయిల్

**90 రోజుల తర్వాత జైలు నుండి విడుదల**

**12 కఠినతరమైన షరతులతో బెయిల్ మంజూరు**

**ఇంటర్నెట్, వీపీఎన్ వాడకంపై కోర్టు ఆంక్షలు**



హైదరాబాద్, ఫిబ్రవరి 18 (తీన్మార్ న్యూస్): చంచల్ గూడా జైలు నుంచి ఐ బొమ్మ రవి విడదలయ్యాడు. హైకోర్టు బెయిల్ ఇవ్వడంతో ఐబొమ్మ రవి బయటకు వచ్చాడు. పోలీసులు ఐ బొమ్మ రవిపై ఐదు సైబర్ క్రైమ్ కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. సుమారు 90 రోజులపాటు జైలులో ఉన్న రవి తాజాగా విడదలయ్యాడు. విడుదల అనంతరం మీడియాతో మాట్లాడకుండా వెనుతిరిడాడు ఐ బొమ్మ రవి. ఈ అంశంపై ఐ బొమ్మ రవి అడ్వకేట్ గోపేంద్రనాథ్ మాట్లాడుతూ ఇమ్మడి రవికి 12 షరతులతో కూడిన బెయిల్ వచ్చింది. బెయిల్ ఆర్డర్ కాపీని జైలు సూపరింటెండెంట్‌కు అందించాం తాజాగా ఇమ్మడి రవి బయటకు వచ్చాడు. ఇండియా వదిలి పెట్టి వెళ్ళవద్దని కోర్టు చెప్పింది. కరేబియన్ దీవుల పౌరుడిగానే కోర్టు గుర్తించింది. రోజు సీసీఎస్ పోలీసుల ఎదుట విచారణ హాజరు కావాలని తెలిపింది. సోషల్ మీడియా అకౌంట్స్ వాడవద్దని కండిషన్ విధించింది. ఇంటర్ నెట్, వీఎన్‌పీ వాడవద్దని కోర్టు స్పష్టం చేసింది. ఇంటర్నెట్ వాడాలి అనుకుంటే పోలీసుల అనుమతి తీసుకొని పోలీసుల ఎదుటే వాడాలనే కండీషన్ పెట్టింది అని వెల్లడించారు.

## తీగ లాగితే డొంక కదులుతోంది

**ధరణి అక్రమాలపై మంత్రి పొంగులేటి ఫైర్**

**కమిటీ విచారణలో దిగ్భ్రాంతికర నిజాలు**



హైదరాబాద్, ఫిబ్రవరి 18 (తీన్మార్ న్యూస్): తీగ లాగితే డొంక కదిలినట్లుగా ధరణి పోర్టల్ వ్యవహారం ఉందని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రజల ఆస్తుల రక్షణకు నిర్మించవలసిన వ్యవస్థనే ఆనాటి ప్రభుత్వంలోని కొంతమంది ప్రముఖులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకున్నారని ఆయన మండిపడ్డారు. ధరణి పోర్టల్‌లోని లొసుగులను ఆసరాగా చేసుకొని స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలను కొల్లగొట్టిన సంఘటనపై ఉన్నత స్థాయి కమిటీతో విచారణ జరిపించగా దిగ్భ్రాంతికరమైన అనేక కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయని అన్నారు. ఇది సాధారణ సాంకేతిక లోపం కాదని, వ్యవస్థాగతంగా సృష్టించిన లోపాల ఫలితమని స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలోని తన కార్యాలయంలో ఉన్నత స్థాయి కమిటీతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆనాడు ధరణి పోర్టల్ సెక్యూరిటీ ఆడిట్ చేసిన సమయంలో గుర్తించిన లోపాలను సరిదిద్దకుండానే అంతా సవ్యంగా ఉన్నట్లు నివేదిక ఇచ్చారని తెలిపారు. అలాగే మానవ ప్రమేయంతో తప్పులు చేసే విధంగా పోర్టల్‌ను రూపొందించారని, భూముల లావాదేవీలకు సంబంధించి అనుమానాస్పదంగా ఉన్న సమాచారం లభించకుండా లాగిన్‌లను డిలీట్ చేశారని పేర్కొన్నారు. అత్యంత రహస్యంగా ఉండవలసిన లాగిన్ వివరాలు లేకుండా పోయాయని ఉన్నత స్థాయి కమిటీ విచారణలో ప్రాథమికంగా గుర్తించినట్లు వెల్లడించారు.

**'టెర్రాసిస్' అప్పగించడం వల్లే సమస్యలు**

నిబంధనలకు విరుద్ధంగా జరిగిన భూ లావాదేవీల సమాచారం లభించకుండా చేశారని, ఫోరెన్సిక్ ఆడిట్‌లో 'కోడ్ ఆడిట్' నిర్వహించలేదన్న విషయం బహిర్గతమైందని అన్నారు. ఈ నేపథ్యంలో తక్షణమే ధరణి పోర్టల్‌పై కోడ్ ఆడిట్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ధరణి పోర్టల్ నిర్వహణ బాధ్యతను 'టెర్రాసిస్' అనే విదేశీ సంస్థకు అప్పగించడం వల్లే సమస్యలు ఎదురవుతున్నాయని గుర్తించామన్నారు.

**భవిష్యత్తులో ఏ పొరపాట్లు జరగవు**

సీఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు ధరణి లోపాలను అడ్డుపెట్టుకొని ప్రభుత్వానికి రావాల్సిన స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలను కొల్లగొట్టిన వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని, తప్పు చేసిన వారు ఎవరైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వానికి రావాల్సిన ప్రతి పైసాను వసూలు చేస్తామన్నారు. ఉన్నత స్థాయి కమిటీ ఇచ్చిన నివేదికను పరిగణనలోకి తీసుకొని, భవిష్యత్తులో ఇటువంటి పొరపాట్లు జరగకుండా, అధికారుల ప్రమేయానికి ఆస్కారం లేకుండా, ప్రజలకు ఫ్రెండ్లీగా ఉండేలా 'భూభారతి' పోర్టల్‌ను నిర్వహించాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా ప్రజల భూముల విషయంలో ఎటువంటి రాజీ పడబోమని, ధరణి పేరుతో జరిగిన ప్రతి అక్రమాన్ని వెలికితీస్తామని తెలిపారు. సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల్లో నిర్వహించిన విధంగానే మిగిలిన జిల్లాల్లోనూ ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహణకు చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి పొంగులేటి ఆదేశించారు.

## పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

**మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష**

**4.22 లక్షల దరఖాస్తులు**

**అర్హులైన వారందరికీ పారదర్శక ఎంపిక**



హైదరాబాద్, ఫిబ్రవరి 18 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ జిల్లాలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ భరోసా కల్పించారు. సచివాలయంలో హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. ఎా1 కింద 4,800 మందికి రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణానికి నిధులు ఇచ్చామని స్పష్టం చేశారు. ఎా2 కింద హైదరాబాద్ నుంచి 4.22 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. భాగ్యనగరంలో స్థలాల సేకరణతో +ం5 నుంచి +ం10 వరకు ఇళ్ల నిర్మాణ ప్లాన్ చేస్తున్నామన్నారు. ఈ క్రమంలో పెండింగ్ డబుల్ బెడ్ రూం ఇళ్ల పనులు వెంటనే పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే, మురికివాడల్లో ఇందిరమ్మ మోడల్ కాలనీల ఏర్పాటుపై మంత్రులు సమీక్షించారు. ఇందిరమ్మ ఇళ్లను పారదర్శకంగా అందజేస్తామని నిజమైన లబ్ధిదారుల ఎంపికే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

## మాది ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వం: మంత్రి సీతక్క

**జీవో నెం.317తో నష్టపోయిన కార్యదర్శులకు న్యాయం చేస్తున్నాం**

**పంచాయతీ సెక్రటరీస్ క్యాలెండర్, డైరీని ఆవిష్కరించిన మంత్రి సీతక్క**



హైద్రాబాద్, ఫిబ్రవరి 18 (తీన్మార్ న్యూస్): సచివాలయంలో పంచాయతీ సెక్రటరీస్ అసోసియేషన్ క్యాలెండర్, డైరీను పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులను అభినందించిన మంత్రి, గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర ఎంతో కీలకమని ప్రశంసించారు. జీవో నెం.317 కారణంగా స్థానికత కోల్పోయి దూర ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న 223 మంది పంచాయతీ కార్యదర్శులకు రెండు సంవత్సరాల పాటు అంతర్ జిల్లా డిప్యూటేషన్‌పై నియామకానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు వెల్లడించారు. జీవో ప్రతులను మంత్రి సీతక్క చేతుల మీదుగా స్వీకరించిన కార్యదర్శులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఉద్యోగులకు అనుకూలమైన ప్రభుత్వమని స్పష్టం చేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం సానుకూల దృక్పథంతో వ్యవహరిస్తోందని, అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను పరిశీలించి అంతర్ జిల్లా డిప్యూటేషన్లకు అనుమతి ఇచ్చామని తెలిపారు. ఈ నిర్ణయంతో 223 మంది పంచాయతీ కార్యదర్శులకు గణనీయమైన ఊరట లభించిందన్నారు. మిగిలిన సమస్యల పరిష్కారంపైనా ప్రభుత్వం సానుకూలంగా ఉందని, అధికారులతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు. జీవో నెం.317 వల్ల నష్టపోయిన పంచాయతీ కార్యదర్శులకు న్యాయం చేస్తూ అంతర్ జిల్లా డిప్యూటేషన్లకు అనుమతులు మంజూరు చేసినందుకు మంత్రి సీతక్కకు కార్యదర్శులు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క కృషి వల్లే జీవో నెం.317లో ఉన్న లోపాలను సరిదిద్దే దిశగా పంచాయతీ రాజ్ శాఖ ముందంజలో నిలిచిందని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీపీఎస్ఏ అధ్యక్షుడు పి. మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఈ. శ్రీనివాస్, ట్రెజరర్ జె. పాండరినాథ్, ఉపాధ్యక్షుడు సి. నాగేశ్, అర్గనైజింగ్ సెక్రటరి బి. సురేష్ గౌడ్, ఈసీ సభ్యులు ఎం. కవితా దేవి, ఆర్. వేణు తదితరలు డైరి ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలల బలోపేతమే లక్ష్యం

**టీజీసీహెచ్ఈ ఆధ్వర్యంలో ఎన్ఐఆర్ఎఫ్ వర్క్‌షాప్**

**జాతీయ స్థాయి గుర్తింపుకు ప్రత్యేక కార్యాచరణ**



హైదరాబాద్, ఫిబ్రవరి 18 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యా ప్రమాణాలను మెరుగుపరిచి, జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్ర ఉన్నత విద్యా మండలి (టీజీసీహెచ్ఈ) అడుగులు వేస్తోంది. 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా, బుధవారం మాసాబ్ ట్యాంక్‌లోని ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్)పై ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రతినిధులకు ఒక రోజు వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌ను ప్రారంభించిన టీజీసీహెచ్ఈ చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లు, అక్రిడిటేషన్లను మెరుగుపరిచేందుకు మండలి ప్రత్యేక మెంటరింగ్‌ను ప్రారంభించిందని తెలిపారు. ర్యాంకింగ్‌లు పెరగడం వల్ల కళాశాలలకు నిధుల లభ్యత పెరగడమే కాకుండా, విద్యా నాణ్యత కూడా మెరుగుపడుతుందని ఆయన పేర్కొన్నారు. పరిశోధనలు, సైటేషన్లు, పేటెంట్లు, నిధులు పొందే ప్రాజెక్టులపై అధ్యాపకులు దృష్టి సారించాలని ఆయన సూచించారు. ఎన్ఐఆర్ఎఫ్‌ను కేవలం ఒక మూల్యాంకన సాధనంగా కాకుండా, విద్యా సంస్థల వృద్ధికి ఒక రోడ్‌మ్యాప్‌గా చూడాలని కోరారు. వర్క్‌షాప్‌లో భాగంగా పలువురు నిపుణులు విలువైన సూచనలు చేశారు. డా. కె. వీరాంజనేయులు (ఎస్ కేఎల్ టీహెచ్యూ) అడ్వైజర్ ఎన్ఐఆర్ఎఫ్ మెథడాలజీ, స్కోర్ వెయిటేజీపై అవగాహన కల్పించారు. డా. జె. ఉపేందర్ (ఓయూ నోడల్ ఆఫీసర్) టీచింగ్ లెర్నింగ్ రిసోర్సెస్, రీసెర్చ్ స్కోర్‌ను ఎలా పెంచుకోవాలో వివరించారు. కె. వెంకటేష్ (డైరెక్టర్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అకాడెమిక్ ఎక్సలెన్స్) డేటా మేనేజ్‌మెంట్, డేటా అప్‌లోడ్ చేసే సరైన విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టీజీసీహెచ్ఈ వైస్ చైర్మన్లు ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం, ప్రొఫెసర్ ఎస్. కె. మహమూద్, సెక్రటరీ ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్, సిసిఈ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ డిఎస్ఆర్. రాజేందర్ సింగ్ పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల నుంచి సుమారు 100 మంది ఐక్యూఏసీ కోఆర్డినేటర్లు, నోడల్ ఆఫీసర్లు, సీనియర్ ఫ్యాకల్టీ ఈ వర్క్‌షాప్‌కు హాజరయ్యారు.

## ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు లైన్ క్లియర్

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (తీన్మార్ న్యూస్): ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు లైన్ క్లియర్ అయ్యింది. మున్సిపల్ ఎన్నికపై గతంలో ఉన్న స్టేను తెలంగాణ హైకోర్టు ఎత్తివేసింది. ఈసీ, కలెక్టర్ తుది నిర్ణయం తీసుకోవాలని న్యాయస్థానం ఆదేశించింది. ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ ఎన్నికపై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ ఎన్నికపై రెండు రోజుల క్రితమే హైకోర్టు స్టే విధించగా దాన్ని ఎత్తివేస్తూ న్యాయస్థానం నిర్ణయం తీసుకుంది. మరోవైపు ఇబ్రహీంపట్నం 19వ వార్డు కౌన్సిలర్ ఆకుల యాదగిరి మిస్సింగ్‌పై హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలైంది. దీనిపై ఈరోజు విచారణ జరుగగా యాదగిరిని కోర్టు ముందు హాజరుపర్చారు ఇబ్రహీపట్నం పోలీసులు. అతడి స్టేట్‌మెంట్‌ను న్యాయస్థానం రికార్డ్ చేసింది. బీఆర్ఎస్ నేతలు తనను బలవంతంగా చీరాలకు తీసుకెళ్లి రిసార్ట్‌లో బంధించారని, ఎన్నికల ఫలితాలు వచ్చిన రోజు దాదాపు 12 గంటల పాటు హైదరాబాద్ మొత్తం తిప్పి చీరాలకు తీసుకెళ్లారని యాదగిరి స్టేట్‌మెంట్ ఇచ్చారు.

# ధనాధన్ దూబే ధమాకా





## అర్ధసెంచరీతో విజృంభణ
## రాణించిన వరుణ్ చక్రవర్తి
## నెదర్లాండ్స్‌పై భారత్ విజయం

అహ్మదాబాద్: ప్రతిష్టాత్మక టీ20 ప్రపంచకప్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ వరుస విజయాల జోరు దిగ్విజయంగా కొనసాగుతున్నది. ఇప్పటికే సూపర్–8 బెర్తు దక్కించుకున్న సూర్యకుమార్ యాదవ్ సేన తమ ఆఖరి లీగ్ పోరులో అదరగొట్టింది. బుధవారం మొతెరా స్టేడియంలో జరిగిన గ్రూపు–ఏ మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 17 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తద్వారా టీ20 ప్రపంచకప్‌లో తమ వరుస విజయాల రికార్డును 12కు పెంచుకుంది.

తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న టీమ్‌ఇండియా..శివమ్ దూబే(31 బంతుల్లో 66, 4ఫోర్లు, 6సిక్స్‌లు) ధనాధన్ అర్ధసెంచరీతో నిర్ణీత 20 ఓవర్లలో 193/6 స్కోరు చేసింది. టాపార్డర్ బ్యాటర్లు అభిషేక్‌శర్మ(0) మరోమారు విఫలమైన వేళ మిడిల్‌లో దూబేతో పాటు హార్దిక్‌పాండ్యా(21 బంతుల్లో 30, 3 సిక్స్‌లు) రాణించడంతో భారత్ పోరాడే స్కోరు అందుకుంది. వాన్‌బీక్(3/56), ఆర్యన్ దత్(2/19) రాణించారు. లక్ష్యఛేదనలో నెదర్లాండ్స్ అద్భుత పోరాటపటిమ కనబరిచింది.

టీమ్‌ఇండియా బౌలింగ్ దాడిని సమర్థంగా నిలువరిస్తూ 194 పరుగుల ఛేదనలో 7 వికెట్లు కోల్పోయి 176 పరుగులు చేసింది. బాస్ డీ లిడె(33), లియాన్ కాచెట్(26) తుదికంటా పోరాడారు. వరుణ్ చక్రవర్తి(3/14) మూడు వికెట్లు తీయగా, బ్యాట్‌తో అదరగొట్టిన దూబే (2/35) బంతితోనూ ఆకట్టుకున్నాడు. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జట్టు విజయంలో కీలకంగా వ్యవహరించిన దూబేకు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. ఈనెల 21 నుంచి సూపర్–8 పోరు మొదలుకానుంది. తమ తొలి పోరులో 22న దక్షిణాఫ్రికాతో భారత్ తలపడనుంది.

### దూబే దంచగా:

టీమ్‌ఇండియా మరోమారు స్పిన్ బౌలింగ్‌లో ఘోరంగా తడబడింది. టాస్ గెలిచిన కెప్టెన్ సూర్యకుమార్ మరో ఆలోచన లేకుండా బ్యాటింగ్ వైపు మొగ్గుచూపాడు. మెగాటోర్నీ ముందు వరకు ప్రత్యర్థులకు దడపుట్టేలా బ్యాటింగ్ చేసిన అభిషేక్‌శర్మ ముచ్చటగా మూడోసారి సున్నా చుట్టాడు. భారత సంతతి స్పిన్నర్ ఆర్యన్ దత్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే భారీ షాట్ ఆడబోయిన అభిషేక్ పరుగుల ఖాతా తెరువకుండానే నిరాశగా వెనుదిరిగాడు.

దీంతో స్కోరుబోర్డుపై పరుగులు చేరకముందే టీమ్‌ఇండియా..అభిషేక్ వికెట్ కోల్పోయింది. ఈ తరుణంలో ఇన్‌ఫామ్ బ్యాటర్ ఇషాన్ కిషన్(18), హైదరాబాదీ తిలక్‌వర్మ(31) దూకుడుగా ఆడే ప్రయత్నం చేశారు. వాన్ బీక్ బౌలింగ్‌లో స్ట్రయిట్ సిక్స్‌తో తిలక్ తన ఉద్దేశమేంటో చెప్పకనే చెప్పాడు. మరో ఎండ్‌లో ఇషాన్ కూడా చెలరేగడంతో పరుగుల రాక మొదలైంది. ఇన్నింగ్స్ గాడిలో పడిందనుకున్న తరుణంలో బంతిపై నియంత్రణ కోల్పోయిన ఇషాన్ బ్యాట్‌తో వికెట్లను గిరాటేశాడు.

దీంతో పవర్‌ప్లే ముగిసే సరికి టీమ్‌ఇండియా 2 వికెట్లు కోల్పోయి 51 పరుగులు చేసింది. తిలక్‌కు కెప్టెన్ సూర్యకుమార్ జత కలిశాడు. వీరిద్దరు ఆచితూచి ఆడుతూ సింగిల్స్‌తో స్ట్రయిక్ రొటేట్ చేశారు. బౌలింగ్ మార్పుగా వచ్చిన వాన్‌బీక్ బౌలింగ్‌లో భారీ షాట్ ఆడబోయిన తిలక్..బౌండరీ వద్ద వాండర్ మెర్వ్ సూపర్ క్యాచ్‌తో మూడో వెనుదిరుగడంతో 30 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఆ తర్వాత వచ్చిన దూబే క్రీజులో కుదురుకునేందుకు సమయం తీసుకుని ఆ తర్వాత తనదైన శైలిలో బ్యాటు ఝులిపించాడు. మందకోడిగా సాగుతున్న ఇన్నింగ్స్‌ను భారీ సిక్స్‌లతో ఉషారు తెప్పించాడు. తన ట్రేడ్‌మార్క్ షాట్లతో విరుచుకుపడుతూ 25 బంతుల్లో అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు. సూర్య ఔటైనా..హార్దిక్‌తో కలిసి కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఒక దశలో కనీసం 160 స్కోరు అయినా దాటుతుందా అన్న అంచనాలను తలకిందులు చేస్తూ టీమ్‌ఇండియాకు భారీ స్కోరు అందించడంతో కీలకమయ్యాడు. వాన్ బీక్ బౌలింగ్‌లో క్యాచ్ ఔట్‌తో ఐదో వికెట్‌కు 76 పరుగుల భాగస్వామ్యం ముగిసింది.

### డచ్ పోరాటం వృథా:

లక్ష్యఛేదనలో డచ్ టీమ్ అద్భుత పోరాట పటిమ ప్రదర్శించింది. మెగాటోర్నీలో ఆఖరి మ్యాచ్ ఆడిన నెదర్లాండ్స్..ఒక రకంగా భారత్‌కు దీటైన పోటీనిచ్చింది. టీమ్‌ఇండియా బౌలింగ్‌కు పరీక్ష పెడుతూ కండ్లు చెదిరే రీతిలో షాట్లు ఆడింది. ఓపెనర్లు లెవిట్(24), మ్యాక్స్ వో డౌడ్(20) ఒకింత మెరుగైన శుభారంభాన్ని అందించారు.

అయితే మిస్టరీ స్పిన్నర్ వరుణ్ ఎంట్రీతో ఇన్నింగ్స్ స్వరూపం మారిపోయింది. వరుణ్ బౌలింగ్‌ను అంచనా వేయలేకపోయిన డచ్ బ్యాటర్లు వికెట్లు సమర్పించుకున్నారు. అకెర్‌మన్(23), ఆర్యన్‌దత్(0)ను వరుస బంతుల్లో ఔట్ చేసిన వరుణ్..టీమ్‌ఇండియాను పోటీలోకి తీసుకొచ్చాడు. టోర్నీలో సూపర్–8 మ్యాచ్‌లను దృష్టిలో పెట్టుకుని కెప్టెన్ సూర్య పలు ప్రయోగాలు చేశాడు. దూబేను బౌలింగ్ దించగా డచ్ బ్యాటర్లు అంతే దీటుగా సమాధానమిచ్చారు. దూబేకు తోడు హార్దిక్, సుందర్ పెద్దగా ప్రభావం చూపించలేకపోయారు. ఆఖర్లో విజయానికి దగ్గరికి వచ్చిన డచ్ టీమ్ లక్ష్యాన్ని అందుకోలేకపోయింది.

### సంక్షిప్త స్కోర్లు

భారత్: 20 ఓవర్లలో 193/6(దూబే 66, తిలక్‌వర్మ 31, వాన్ బీక్ 3/56, ఆర్యన్ 2/19), నెదర్లాండ్స్: 20 ఓవర్లలో 176/7(బాస్ డీలిడె 33, లియాన్ కాచెట్ 26, వరుణ్ 3/14, దూబే 2/35)

# సఫారీలు ఘనంగా..




న్యూఢిల్లీ: టీ20 ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా తమ గ్రూపు ప్రస్థానాన్ని అజేయంగా ముగించింది. బుధవారం జరిగిన పోరులో సఫారీలు 6 వికెట్ల తేడాతో యూఏఈపై ఘన విజయం సాధించింది. అవకాశాలను అనుకూలంగా మలుచుకుంటూ కార్బన్ బాశ్(3/12), నోకియా(2/28) ధాటికి యూఏఈ 20 ఓవర్లలో 122/6 స్కోరు చేసింది. అలీషాన్ షరాఫ్(45) ఒక్కడే ఫర్వాలేదనిపించగా, మిగతావారు పూర్తిగా తేలిపోయారు. 38 బంతుల్లో 5ఫోర్లు, ఒక సిక్స్‌తో ఆకట్టుకున్న అలీషాన్ రెండు సార్లు ఔటయ్యే ప్రమాదం నుంచి బయటపడ్డాడు. మ్యాచ్ మొత్తంగా సఫారీ ఫీల్డర్లు నాలుగు క్యాచ్‌లు విడిచిపెట్టి యూఏఈ బ్యాటర్లకు చాన్స్ ఇచ్చారు. స్వల్ప లక్ష్యాన్ని సఫారీలు 13.2 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 123 పరుగులు చేసింది. బ్రెవిస్(36), రికల్టన్(30) దూకుడుగా ఆడారు. ఓపెనర్లు మార్క్రమ్(28), డికాక్(14) జట్టుకు మెరుగైన శుభారంభాన్ని అందించారు. కెప్టెన్ మార్క్రమ్ యూఏఈ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. బ్రెవిస్, రికల్టన్ ఇన్నింగ్స్‌ను గాడిలో పడేశారు. ఈ ఇద్దరు కలిసి మూడో వికెట్‌కు 49 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు.

# ఫర్హాన్ సూపర్ సెంచరీ

## సూపర్-8కు పాకిస్థాన్



కొలంబో: సూపర్–8కు అర్హత సాధించాలంటే తప్పక గెలువాల్సిన పరిస్థితుల్లో పాక్ సమష్టి ప్రదర్శనతో ఆకట్టుకుంది. బుధవారం నమీబియాతో జరిగిన పోరులో పాక్ 102 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. పాక్ ఓపెనర్ ఫర్హాన్(58 బంతుల్లో 100 నాటౌట్, 11ఫోర్లు, 4సిక్స్‌లు) సూపర్ సెంచరీతో చెలరేగిన వేళ 20 ఓవర్లలో 199/3 స్కోరు చేసింది. మరో ఓపెనర్ ఆయూబ్(14) నిరాశపరిచినా ఫర్హాన్ ధనాధన్ ఇన్నింగ్స్‌తో పాక్‌కు భారీ స్కోరు అందించడంలో కీలకమయ్యాడు. పసలేని నమీబియా బౌలింగ్‌ను సులువుగా ఎదుర్కొంటూ సాధికారిక ఇన్నింగ్స్ నిర్మించాడు. 57 బంతుల్లో సెంచరీ ఖాతాలో వేసుకున్న ఫర్హాన్.నాలుగో వికెట్‌కు షాదాబ్‌ఖాన్(36నాటౌట్ )తో కలిసి 81 పరుగుల అజేయ భాగస్వామ్యాలు నెలకొల్పాడు. ఛేదనలో నమీబియా..ఉస్మాన్ తారీఖ్(4/16), షాదాబ్‌ఖాన్(3/19) ధాటికి 17.3 ఓవర్లలో 97 పరుగులకు కుప్పకూలింది.

# జమ్మూ కశ్మీర్ రంజీ టీమ్ చరిత్ర

## తొలిసారి ఫైనల్ చేరిన జట్టు
## 67 ఏళ్లలో ఇదే తొలిసారి..!



జమ్మూ కశ్మీర్ రంజీ టీమ్ చరిత్ర సృష్టించింది. 67 ఏళ్ల రంజీ ట్రోఫీ క్రికెట్ చరిత్రలో తొలిసారి ఫైనల్ చేరింది. రంజీ ట్రోఫీ 2025–26 సీజన్‌లో భాగంగా బెంగాల్‌తో జరిగిన సెమీఫైనల్లో సమష్టిగా రాణించిన జమ్మూ కశ్మీర్ 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బెంగాల్ తొలి ఇన్నింగ్స్‌లో 328 పరుగులు చేసింది. సుదీప్ కుమార్ ఘూరమి(146) సెంచరీతో ఆకట్టుకున్నాడు. అనంతరం జమ్మూ కశ్మీర్ తొలి ఇన్నింగ్స్‌లో 302 పరుగులకు ఆలౌటైంది. భారత పేసర్ మహహ్మద్ షమీ(8/90) కెరీర్ బెస్ట్ ప్రదర్శన కనబర్చాడు. అబ్దుల్ సమద్(82), పరాస్ డోగ్రా(58) హాఫ్ సెంచరీలతో రాణించారు. అయితే రెండో ఇన్నింగ్స్‌లో బెంగాల్ 99 పరుగులకే కుప్పకూలింది. షాబాజ్ అహ్మద్(24) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. జమ్మూ కశ్మీర్ బౌలర్లు ఔకిబ్ నమీ(4/36), సునీల్ కుమార్(4/27) నాలుగేసి వికెట్లతో బెంగాల్ పతనాన్ని శాసించారు. యుధ్వీర్ సింగ్ చరక్ 2 వికెట్లు పడగొట్టాడు. నాలుగో రోజు ఆటలో జమ్మూ కశ్మీర్ 4 వికెట్లు కోల్పోయి 126 పరుగులు చేసి విజయాన్నందుకుంది. అబ్దుల్ సమద్(30 నాటౌట్), శుభమ్ పుండిర్(27) రాణించారు. బెంగాల్ బౌలర్లలో ఆకాశ్ దీప్ మూడు వికెట్లు తీయగా.. మహమ్మద్ షమీ ఒక వికెట్ పడగొట్టాడు. మరో సెమీఫైనల్లో కర్ణాటక, ఉత్తరఖాండ్ తలపడుతున్నాయి. ఈ మ్యాచ్‌లో కర్ణాటక 770 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఆ జట్టే ఫైనల్ చేరే అవకాశాలు ఉన్నాయి. ఫిబ్రవరి 24 నుంచి రంజీ ట్రోఫీ ఫైనల్ ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్‌లో బెంగాల్‌తో పాటు కర్ణాటక తలపడనున్నాయి.

# టీ20 వరల్డ్ కప్ నుంచి మతీషా పతిరానా అవుట్



శ్రీలంక క్రికెట్ జట్టుకు, ఐపీఎల్ ఫ్రాంచైజీ కోల్‌కతా నైట్ రైడర్స్?కి భారీ షాక్ తగిలింది. శ్రీలంక స్టార్ పేసర్, బేబీ మలింగగా పిలవబడే మతీషా పతిరానా గాయం కారణంగా టీ20 వరల్డ్ కప్ 2026 నుంచి దాదాపుగా నిష్క్రమించాడు. కేవలం శ్రీలంకకే కాకుండా, అతన్ని భారీ ధరకు కొనుగోలు చేసిన కేకేఆర్‌కు కూడా ఇది పెద్ద తలనొప్పిగా మారింది. టీ20 వరల్డ్ కప్ గ్రూప్ స్టేజ్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో పతిరానా గాయపడ్డాడు. తన మొదటి ఓవర్ (ఇన్నింగ్స్ 3వ ఓవర్) వేస్తున్న సమయంలో, నాలుగో బంతి వేసిన వెంటనే ఎడమ కాలి హామ్‌స్ట్రింగ్ నొప్పితో మైదానంలోనే కుప్పకూలాడు. నొప్పితో విలవిలలాడిన పతిరానాను ఫిజియోలు మైదానం వెలుపలికి తీసుకెళ్లారు. ఆ ఓవర్‌లోని మిగిలిన రెండు బంతులను కెప్టెన్ దసున్ శనక పూర్తి చేయాల్సి వచ్చింది. తాజా సమాచారం ప్రకారం.. పతిరానా కనీసం 3 నుంచి 4 వారాల పాటు ఆటకు దూరమయ్యే అవకాశం ఉంది. దీనివల్ల శ్రీలంక సూపర్–8 రౌండ్‌కు అర్హత సాధించినప్పటికీ, పతిరానా అందుబాటులో ఉండకపోవచ్చు. అతని స్థానంలో దిల్షాన్ మధుశంక లేదా బినుర ఫెర్నాండో జట్టులోకి వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే స్టార్ స్పిన్నర్ వానిందు హసరంగా, పేసర్ ఇషాన్ మలింగ గాయాలతో దూరం కావడంతో శ్రీలంక బౌలింగ్ విభాగం బలహీనపడింది. ఐపీఎల్ 2026 మినీ వేలంలో కోల్‌కతా నైట్ రైడర్స్ పతిరానాను ఏకంగా రూ.18 కోట్లకు కొనుగోలు చేసింది. డెత్ ఓవర్లలో యార్కర్లు వేయడంలో దిట్ట అయిన పతిరానాపై కేకేఆర్ భారీ ఆశలు పెట్టుకుంది. కేకేఆర్ ఇప్పటికే ముస్తాఫిజూర్ రెహమాన్‌ను విడుదల చేసింది. మరోవైపు భారత పేసర్ హర్షిత్ రాణా కూడా గాయంతో సతమతమవుతున్నాడు. ఐపీఎల్ ప్రారంభానికి ఇంకా సమయం ఉన్నప్పటికీ, పతిరానా గాయం తీవ్రత ఎక్కువగా ఉంటే అతను ఐపీఎల్ 2026 సీజన్ మొత్తానికి లేదా సగం సీజన్‌కు దూరమయ్యే ప్రమాదం ఉంది. అదే జరిగితే కేకేఆర్ వెచ్చించిన రూ.18 కోట్లు వృథా కావడమే కాకుండా, జట్టు బౌలింగ్ సమతూకం దెబ్బతింటుంది.



# నాకు శక్తి..ప్రేణ అన్నీ సురేఖయే

## భార్య పుట్టిన రోజు చిరు ఎమోషనల్ పోస్ట్



మెగాస్టార్ చిరంజీవి తన సతీమణి సురేఖ పుట్టినరోజు మరియు వారి వివాహ వార్షికోత్సవం సందర్భంగా సోషల్ మీడియా వేదికగా ఎమోషనల్ పోస్ట్‌ను పంచుకున్నారు. తన సినీ ప్రయాణంలోనే కాకుండా, జీవిత ప్రయాణంలోనూ తనకు అండగా నిలిచిన సురేఖపై తనకున్న అపారమైన ప్రేమాభిమానాలను ఆయన ఈ సందర్భంగా చాటుకున్నారు. 1980 ఫిబ్రవరి 20న వివాహం చేసుకున్న ఈ జంట త్వరలోనే 46వ వివాహ వార్షికోత్సవాన్ని జరుపుకోనుండగా, సురేఖ తన విజయాల వెనుక ఉన్న అసలు శక్తి అని చిరంజీవి కొనియాడారు. తన ప్రతి అడుగులో వెంట నడిచిన సురేఖకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ, ఆమె తమ కుటుంబానికి కేంద్రబిందువని, అందరినీ ప్రేమానురాగాలతో ఒక్కటిగా ఉంచే శక్తి ఆమెకే ఉందని చిరంజీవి పేర్కొన్నారు. తన కుటుంబ సభ్యులను సొంతవారిగా భావించి, తల్లిదండ్రులకు కన్నకూతురిగా మారిపోయిన తీరును ఆయన గుర్తు చేసుకున్నారు. తన సక్సెస్ గురించి ఎవరైనా అడిగితే అది కేవలం తన టాలెంట్ వల్లనో, కష్టం వల్లనో వచ్చినది కాదని, అది పూర్తిగా సురేఖ వల్లే సాధ్యమైందని చిరంజీవి స్పష్టం చేశారు. ఇంటి బాధ్యతలన్నింటినీ ఆమె భుజాన వేసుకోవడం వల్లే తాను ఎటువంటి ఆందోళన లేకుండా వృత్తిపై దృష్టి పెట్టగలిగానని, ఏ సంక్షోభంలోనైనా తమను కలిపి ఉంచే బలం ఆమె అని ఆయన ఎమోషనల్ అయ్యారు. 'నేను ఈ రోజు ఇలా ఉన్నానంటే దానికి కారణం నువ్వే' అంటూ తన మనసులోని మాటను హృద్యంగా పంచుకున్న ఈ పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. మెగా అభిమానులు, సినీ ప్రముఖులు సురేఖ కొణిదెల గారికి పెద్ద ఎత్తున పుట్టినరోజు మరియు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.



# మీరా జాస్మిన్ టాలీవుడ్ లో సెకెండ్ ఇన్నింగ్స్!

కేరళ కుట్టి మీరాజాస్మిన్ తెలుగు ప్రేక్షకులకు పరిచయం అసవరం లేని పేరు. తెలుగులో నటించింది కొన్ని సినిమాలే? వాటితోనే తనదైన ముద్ర వేసింది. అమ్మడు అందం, అభినయంతో ప్రేక్షకుల్ని కట్టిపడేసింది. -అమ్మాయి బాగుంది- ,- గుడుంబా శంకర్-, - భద్ర-, - రారాజు-, -మహారథి-, -గోరింటాకు- లాంటి చిత్రాలతో ప్రేక్షకుల్ని అలరించింది. తెలుగు సినిమాలతో పాటు పేర్లలల్ గా కన్నడ, తమిళ, మలయాళ భాషలో కూడా సినిమాలు చేసింది. అమ్మడు ఎక్కువగా మాతృ భాషకు ప్రాధన్యత ఇచ్చి పనిచేసింది. తెలుగులో చివరిగా స్వాగ్ అనే చిత్రంలో నటించింది. వాస్తవానికి 2013 తర్వాత కేవలం రెండు తెలుగు సినిమాల్లోనే నటించింది. అవి ఆశించిన ఫలితాలు సాధించలేదు. అటుపై 2014లో ధాంపత్య జీవితంలో కి అడుగు పెట్టింది. దీంతో తెలుగు సినిమాలకు పర్తిగా దూరమైంది. అప్పటి నుంచి ఇతర భాషల్లోనే బిజీగా కొనసాగింది. ప్రస్తుతం మాలీవుడ్, శాండిల్ వుడ్ లో ఎక్కువ సినిమాలు చేస్తోంది. అయితే తాజాగా మీరాజాస్మిన్ మళ్లీ టాలీవుడ్ లో కంబ్యాక్ అయ్యే ప్రయత్నాలు చేస్తోంది. వేర్వేరు భాషల్లో సెకెండ్ ఇన్నింగ్స్ కొనసాగిస్తోన్న నేపథ్యంలో తెలుగులో మళ్లీ ఎందుకు పని చేయకూడదు అన్న ఆలోచన నుంచి అమ్మడు ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. గతంలో ఉన్న పాత పరిచయాలతో టాలీవుడ్ మేనేజర్లకు టచ్ లో కి వెళ్తోందని తెలిసింది. మీరాజాస్మిన్ వయసు 44 ఏళ్లు. కీలక పాత్రలటకు..క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా మంచి అవకాశాలు వస్తాయి. అంతకంటే ముందే సీనియర్ హీరోలకు పర్ఫెక్ట్ ఛాయిస్ గానూ చెప్పొచ్చు. చిరంజీవి, బాలయ్య, వెంకటేష్, నాగార్జున లాంటి స్టార్లకు మ్యాచ్ అవుతుంది. ఆ నలుగురు హీరోలకు హీరోయిన్ల సమస్య ఎప్పుడూ ఉంటుంది. కాబట్టి మేకర్స్ సీనియర్లకు జోడీగా ఎంపిక చేయోచ్చు. వీరితో మీరాజాస్మిన్ నటించింది లేదు. తర్వాత తరం స్టార్లతోనే సినిమాలు చేసింది. ఈనేపథ్యంలో సీనియర్ల సరసన ఫ్రెష్ అప్పిరియన్స్ ఇస్తోంది. ప్రస్తుతం మాలీవుడ్, కన్నడలో కూడా సీనియర్ హీరోల చిత్రాల్లోనే నటిస్తోంది. మోహన్ లాల్ హీరోగా నటిస్తోన్న 366 చిత్రంలో ఈ భామే హీరోయిన్ గా నటిస్తోంది. ఇందులో ఆమె నైసీ అనే పాత్రలో మోహన్ లాల్ కు భార్య గా నటిస్తోంది. దాదాపు 13 ఏళ్ల తర్వాత వీరిద్దరూ కలిసి నటించడం మరో ఇంట్రెస్టింగ్ విషయం. లాల్ నటించిన గత సినిమాల్లోనూ మీరాజాస్మిన్ నటించింది. అయితే అవి పూర్తి స్థాయి పాత్రలు కాదు. మీరాజాస్మిన్ నటిగా ఎదిగే క్రమంలో వచ్చిన అవకాశాలు అవన్నీ. తాజా అవకాశం పట్ల అమ్మడు ఎంతో సంతోషంగా ఉంది.



# ది కేరళ స్టోరీ సీక్వెల్.. ట్రైలర్ విడుదల

## సంచలనం సృష్టిస్తున్న ట్రైలర్

2023లో బాక్సాఫీస్ వద్ద వివాదాలు సృష్టించిన 'ది కేరళ స్టోరీ' చిత్రానికి సీక్వెల్‌గా 'ది కేరళ స్టోరీ 2: గోస్ బియాండ్' ప్రేక్షకుల ముందుకు రాబోతున్న సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 27న ఈ సినిమా విడుదల కానున్న నేపథ్యంలో, తాజాగా చిత్ర యూనిట్ ట్రైలర్‌ను విడుదల చేయగా.. ఈ ట్రైలర్ సామాజిక మాధ్యమాల్లో పెను దుమారం రేపుతోంది. మొదటి భాగం కంటే ఈ సీక్వెల్ మరింత వివాదాస్పదంగా, అత్యంత తీవ్రమైన అంశాలతో రూపొందినట్లు ట్రైలర్ చూస్తుంటే స్పష్టమవుతోంది. రాబోయే 25 ఏళ్లలో భారత్ ఇస్లామిక్ రాజ్యంగా మారుతుంది అనే వివాదాస్పద డైలాగ్‌తో ఈ ట్రైలర్ ప్రారంభంకాగా.. ఈసారి దర్శకుడు కామాఖ్య నారాయణ్ సింగ్ కథను కేవలం కేరళకే పరిమితం చేయకుండా.. రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో జరుగుతున్నట్లు చెబుతున్న బలవంతపు మత మార్పిడిలు, లవ్ జిహాద్ వంటి అంశాలను ఇందులో చూపించారు. నిర్మాత విపుల్ అమృత్‌లాల్ షా నిర్మించిన ఈ చిత్రంలో గతంలో నటించిన అదా శర్మ స్థానంలో ఉల్కా గుప్తా, అదితి భాటియా, ఐశ్వర్య ఓజా ప్రధాన పాత్రలు పోషించారు. మత మార్పిడికి నిరాకరించిన యువతులను చిత్రహింసలకు గురిచేయడం, బలవంతంగా గొడ్డు మాంసం తినిపించడం వంటి కఠినమైన దృశ్యాలను మేకర్స్ ఈ ట్రైలర్‌లో పొందుపరిచారు. అయితే ఈ ట్రైలర్‌పై కేరళ నెటిజన్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ముఖ్యంగా బలవంతంగా గొడ్డు మాంసం తినిపించే సన్నివేశంపై వారు మండిపడుతున్నారు. కేరళలో బీఫ్‌ను అందరూ ఇష్టంగా తింటారని, ఎవరికీ బలవంతంగా తినిపించాల్సిన అవసరం లేదని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. మరోవైపు, ఈ సినిమా సమాజంలోని చేదు నిజాలను ధైర్యంగా చూపిస్తోందని మరికొందరు సమర్థిస్తున్నారు.



# కనకవతి బాలీవుడ్‌లో బ్యాక్ టూ బ్యాక్!

రుక్మిణీ వసంత్ సౌత్ ఇండస్ట్రీలో మారుమ్రోగుతోన్న పేరు ఇది. -కాంతార చాప్టర్ వన్- లో కనకవతి పాత్రతో అమ్మడు ఊహించని రేంజ్ లో కనెక్ట్ అయింది. అందం, అభినయంతో తెలుగు ఆడియన్స్ కు మరింత దగ్గరైంది. అంతేనా వరుసగా పాన్ ఇండియా చిత్రాలకు కమిట్ అవుతూ అంతకంతకు సంచలనం అవుతోంది. రాకింగ్ స్టార్ యశ్ హీరోగా నటిస్తోన్న -టాక్సిక్- లో అమ్మడు కీలక పాత్ర పోషిస్తోంది. అలాగే యంగ్ టైగర్ ఎన్టీఆర్ హీరోగా నటిస్తోన్న మరో పాన్ ఇండియా చిత్రం -డ్రాగన్- లోనూ ఛాన్స్ అందుకుంది. ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహిస్తోన్నఈ యాక్షన్ థ్రిల్లర్ పై అంచనాలు ఏ రేంజ్ లో ఉన్నాయో చెప్పాల్సిన పనిలేదు. మరిన్ని కొత్త ప్రాజెక్ట్ లు అందుకుంటుందనే ప్రచారం జోరుగా సాగుతోంది. టాలీవుడ్ సీనియర్ హీరోలకు అమ్మడు పర్ఫెక్ట్ ఛాయిస్ గా నెట్టింట వైరల్ అవుతోంది. తెలుగులో ఒక్క సినిమా కూడా చేయకుండా ఓరేంజ్ లో పాపులారిటీ సంపాదించింది. స్ట్రెయిట్ చిత్రంతో హిట్ అందుకుంటే రెట్టింపు క్రేజ్ తో దూసుకుపోతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇదే ఊపులో రుక్మిణీ బాలీవుడ్ ఎంట్రీకి రెడీ అవుతోంది. కార్తీక్ ఆర్యన్ హీరోగా -కిల్- ఫేం నిఖిల్ నగేష్ ఓ చిత్రం తెరకెక్కించడానికి రెడీ అవుతున్నారు. ఇందులో కార్తీక్ కి జోడీగా రుక్మిణీ వసంత్ ను తీసు కుంటున్నట్లు వార్తలొస్తున్నాయి. ఇదొక ఇంటెన్స్ యాక్షన్ రొమాంటిక్ డ్రామాగా రూపొందుతుంది. టి సిరీస్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. వాస్తవానికి ఇదే చిత్రంలో హీరోయిన్ గా అలియాభట్ ను తీసుకోవాలనుకున్నారు. ఆమె తో డిస్కషన్ కూడా జరిగింది. కానీ అలియా బిజీ షెడ్యూల్ కారణంగా నో చెప్పింది. దీంతో బాలీవుడ్ హీరోయిన్లు అందర్నీ పక్కన బెట్టి సౌత్ భామ వైపు చూసారు. అలా రుక్మిణికి ఛాన్స్ వచ్చినట్లు తెలుస్తోంది. అంతేనే ఈ ప్రాజెక్ట్ ప్రపోజల్ దశలో ఉండగానే -ప్రళయ్- ఓ జోంబీ చిత్రంలోనూ ఛాన్స్ అందుకుందనే వార్త వైరల్ గా మారింది. రణ వీర్ సింగ్ కథానాయకుడిగా జై మెహతా దర్శకత్వంలో ఈ చిత్రానికి సంబంధించి ప్రణాళిక సిద్దమవుతోంది. ఇందులోనూ హీరోయిన్ గా రుక్మిణీ వసంత్ అయితే బాగుంటుందని భావిస్తున్నారుట. ఈ ఛాన్స్ గనుక రుక్మిణీ అందుకోగలిగితే అమ్మడి కెరీర్ కు మరో టర్నింగ్ పాయింట్ గా నిలుస్తుంది. ప్రస్తుతం బాలీవుడ్ హీరోల్లో రణవీర్ సింగ్ టాప్ లో కొనసాగుతున్నాడు. -ధురంధర్- విజయంతో అతడి రేంజ్ రెట్టింపు అయిన క్రమంలో అతడితో నటించడానికి ఎంతో మంది బాలీవుడ్ భామలు పోటీ పడుతున్నారు. ఇందులో సీనియర్ భామలు కూడా ఉన్నారు. వారెవరికీ రాని గొప్ప అవకాశం రుక్మిణీ వసంత్ కి వస్తున్నట్లే.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463